Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

ప్రజా TV
PRAJA TELEVISION
The People's Favour
రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 169 | హైదరాబాద్ | మంగళవారం 12 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# మోదీ గ్రేటర్ ప్లాన్!

## విశ్వనగరంలో పాగా వేసే యత్నం.. బాబు, పవన్‌కు పలకరింపు వ్యూహం

ఇద్దరి బలం పనికి వస్తుందనే భావన
హైదరాబాద్‌లో టీడీపీకి క్యాడర్
సినీగ్లామర్ యువత కోసం పవన్ వద్దకు..
ఇక్కడ గెలిచి పట్టుపెంచుకునే యత్నం

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

రానున్న గ్రేటర్ ఎన్నికల్లో కషాయజెండా ఎగురవేసేందుకు తన పర్యటనను కొంత వినియోగించుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయన హైదరాబాద్ పర్యటనలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లను వారి నివాసాలకు వెళ్లి మరీ కలవడం వెనుక కేవలం మర్యాద మాత్రమే కాకుండా, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల చక్రవ్యూహం దాగి ఉందన్న అభిప్రాయం గట్టిగా వినిపిస్తోంది.

### గ్రేటర్ రాజకీయం..

గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పాలక వర్గ కాలపరిమితి ముగిసింది. త్వరలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలను బీజేపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. గత ఎన్నికల్లోనే అనూహ్య ఫలితాలు సాధించిన కమలదళం, ఈసారి మేయర్ పీఠాన్ని దక్కించుకోవడం ద్వారా తెలంగాణలో తామే తదుపరి ప్రత్యామ్నాయం అనే సంకేతాన్ని పంపాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ స్వయంగా రంగంలోకి దిగి, ఎన్డీయే మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన అధినేతలతో మంతనాలు జరపడం చర్చనీయాంశమైంది. హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ నగరంలో గెలవాలంటే టీడీపీ కేడర్ సహకారం, పవన్ కళ్యాణ్ క్రేజ్ తమకు అదనపు బలాన్ని ఇస్తాయని బీజేపీ నాయకత్వం బలంగా నమ్ముతోంది. హైదరాబాద్ రాజకీయాలను శాసించే శక్తి సెటిలర్ల ఓట్లకే ఉంది. ముఖ్యంగా ఐటీ కారిడార్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, మియాపూర్ వంటి ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ మూలాలున్న ఓటర్లు అత్యధికం. వీరిపై చంద్రబాబు నాయుడికి ఇప్పటికీ చెక్కుచెదరని పట్టు ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీకి దూరంగా ఉన్నప్పటికీ, గ్రేటర్ ఎన్నికల్లో ఆ ఓట్లను బీజేపీ వైపు మళ్లించగలిగితే విజయం నల్లేరుపై నడకేనని మోదీ భావిస్తున్నారు. అందుకే ప్రోటోకాల్ పక్కన పెట్టి మరీ బాబు నివాసానికి వెళ్లడం ద్వారా తెలంగాణ రాజకీయాలకు గట్టి సంకేతం పంపించారు.



ప్రధాని నరేంద్రమోదీ రాజకీయ ఎత్తులపై పై ఎత్తులు వేసే వారు ఇప్పట్లో దేశరాజకీయాల్లో ఎవరూ కనిపించం లేదు. వెస్ట్ బెంగాల్ ఎన్నికలతో తిరుగులేని శక్తిగా మారిన మోదీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ అని చెప్పకనే చెప్పారు. తెలంగాణలో అధికారం సాధించడం సాధ్యమా.. కాదా అన్న విషయాన్ని పక్కన పెడితే, ఆదివారం ఆయన పర్యటన వ్యూహాత్మకంగా సాగింది.

### పవన్ చర్మిష్మా కోసం..

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జనసేన పార్టీకి గ్రేటర్ పరిధిలో యువత, మధ్యతరగతి ఓటర్లలో భారీ క్రేజ్ ఉంది. పవన్ కళ్యాణ్ ఏపీలో సాధించిన అఖండ విజయం తెలంగాణలోని ఆయన అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పవన్ ఆపరేషన్ చేయించుకుని

- మిగతా 2వ పేజీలో



# భారత్ ఎవరికీ తలవంచదు

## దేశ ఆత్మ గౌరవానికి ప్రతీక సోమనాథ్

విదేశీ ఆక్రమణదారులు కూల్చినా మళ్లీ నిర్మించుకున్నాం
ఆలయ అమృతోత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ
సోమనాథుడికి పుణ్యక్షేత్ర జలాలతో అభిషేకం
గగనతలంలో భారత వాయుసేన విన్యాసాలు

2లో



# మోదీ పాలనా సామర్థ్యం కోల్పోయారు

## రాహుల్‌గాంధీ విమర్శ

దిల్లీ: పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో తలెత్తుతున్న సవాళ్లను అధిగమించడానికి ప్రధాని మోదీ దేశ ప్రజలకు చేసిన పొదుపు సూచనలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రంగా ధ్వజమెత్తారు. దేశ ప్రయోజనాల పరిరక్షణ విషయంలో రాజీ పడిపోయిన మోదీ దేశాన్ని నడిపే సామర్థ్యం కోల్పోయారని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. ప్రధాని చెప్పిన మాటలు ఆయన వైఫల్యానికి సాక్ష్యాలని రాహుల్ అన్నారు. "త్యాగాలకు సిద్ధం కావాల్సిందిగా ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. బంగారం కొనవద్దు, విదేశాలకు వెళ్లవద్దు, ఇంధనాన్ని తక్కువగా ఖర్చు చేయండి, ఎరువులు తక్కువగా వాడండి, వంట నూనె తగ్గించండి, మెట్రోలో

- మిగతా 2వ పేజీలో



## రైల్వేలో కీలక ముందడుగు

# 'ఔషధి ఎక్స్‌ప్రెస్'

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మే 11 (ప్రజాతీర్పు):

ఔషధ రవాణాలో భారతీయ రైల్వే కీలక ముందడుగు వేసిందని.. 'ఔషధి ఎక్స్‌ప్రెస్' పేరుతో హైదరాబాద్ నుంచి ప్రత్యేక ఫార్మసీ రైలును ముంబయిలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ వరకు మే 2న ప్రారంభించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. "ప్రయాణికుల సేవలు, వస్తు రవాణాతోపాటుగా అత్యాధునిక వసతులు కల్పించడంలో నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలతో దూసుకుపోతున్న భారతీయ రైల్వే ఇప్పుడు ఔషధాల రవాణాపై ప్రత్యేక దృష్టిసారించింది. ఇందులో భాగంగా పీఎం గతిశక్తి కార్యక్రమానికి కొనసాగింపుగా 'భారతీయ ఫార్మా రాజధాని'గా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ నుంచి ముంబయిలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్‌కు ఔషధాలను సరఫరా చేసేందుకు దేశంలోనే

- మిగతా 2వ పేజీలో



- ఈ ఏడాది రూ.26,674 కోట్లు కేటాయించాం
- ఇది బడ్జెట్‌లో 8.22 శాతం.. ఏటా కేటాయింపులు పెంచుతూ 15 శాతానికి చేర్చుతాం
- అత్యుత్తమ బోధన చేపట్టిన టీచర్లను సన్మానిస్తాం
- ఎల్బీ స్టేడియంలో విద్యా వారోత్సవాల ప్రారంభ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి

# విద్యకు బడ్జెట్‌లో 15% నిధులిస్తాం

హైదరాబాద్, మే 11 (ప్రజాతీర్పు):

విద్యాశాఖకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. విద్య కోసం రాష్ట్ర బడ్జెట్‌లో 15% నిధులు కేటాయించాలని రుుష్ట్ర విద్యా కమిషన్ సిఫారసు చేసిందని, అయితే ఒక్కరోజులో ఈ కేటాయింపులను పెంచే పరిస్థితి ఉండద న్నారు. కేటాయింపులను ప్రతి ఏటా బడ్జెట్‌లో క్రమంగా పెంచుతూ పోతామ ని, 15శాతానికి పెరిగే వరకు ఇది కొనసాగుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా సోమవారం నుంచి ఈ నెల 17 వరకు విద్యా వారోత్సవాలను నిర్వహిస్తోంది. సోమవారం ఎల్బీ స్టేడియయిలో విద్యా వారోత్సవాల కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించి టీచర్లు, విద్యార్థులనుద్దేశించి

- మిగతా 2వ పేజీలో

# ప్రజా జీవనంపై అప్రకటిత నిషేధం

## పొదుపు మంత్రం జపించిన ప్రధానిపై సీఎం రేవంత్ ధ్వజం

- అసమర్థ పాలన, విదేశాంగ విధానంలో వైఫల్యాలు కప్పి పుచ్చుకునేందుకే 10 సూత్రాలు
- గాలి తిని, గాల్లో బతకమని చెప్పి వెళ్లారు.. కేంద్రానికి దశ దిశ లేదు..
- అనుభవ రాహిత్యం, అహంకారంతో దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారు
- తమను వ్యతిరేకించే వారిని ఖతం చేయడమే బీజేపీ విధానం
- అధికారిక కార్యక్రమంలో ప్రధాని మాట్లాడిన దానికి రాజకీయాలతో సంబంధం లేదు
- మీడియాతో ముఖ్యమంత్రి సుదీర్ఘ చిట్‌చాట్

హైదరాబాద్, మే 11 (ప్రజాతీర్పు):

ప్రధాని మోదీ తన అసమర్థ పాలన, విదేశాంగ విధానంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజల జీవనంపై అప్రకటిత నిషేధం ప్రకటించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'బంగారం కొనొద్దు.. వెకేషన్‌కు వెళ్లొద్దు.. నూనె తినడం తగ్గించాలంటూ ప్రధాని ప్రజలకు పిలుపునివ్వడం బాధ్యతా రాహిత్యం. మోదీ ప్రభుత్వ వైఫల్యం, అసమర్థ విధానాలే ఇందుకు కారణం. విదే శాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైంది. అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి, వారి సూచనలు

- మిగతా 2వ పేజీలో





# కాల్పుల విరమణ గాల్లో దీపం

## అది ఎప్పుడైనా ముగిసిపోవచ్చు

యుద్ధం ఏ క్షణంలోనైనా మొదలుకావొచ్చని ట్రంప్ వ్యాఖ్య

వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఇరాన్‌తో కొనసాగుతున్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని బలవంతంగా కొనసాగిస్తున్నామని, అది గాల్లో దీపంలా తయారైందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. "కాల్పుల విరమణ సమర్థంగా అమలుకావట్లేదు. కాల్పుల విరమణ అనేది అత్యంత బలహీనంగా ఉంది. ఒక రకంగా అది ఐసీయూలో వెంటిలేటర్ మీద ప్రాణాధార వ్యవస్థ మీద నడుస్తోంది. అది ముగిసిపోయే అవకాశాలే చాలా ఎక్కువ"అంటూ యుద్ధం

- మిగతా 2వ పేజీలో



## మోదీ గ్యారంటీ కోసం రాష్ట్ర ప్రజలు

# ఎదురుచూస్తున్నారు

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

హైదరాబాద్, మే 10 (ప్రజాతీర్పు):

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో యువత, మహిళా వ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తోందని.. అందుకే అభివృద్ధిని కాంక్షించే మోదీ గ్యారంటీ కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "రాబోయే రోజుల్లో భాజపా తెలంగాణలో బలమైన ప్రత్యామ్నాయంగా అవతరించడం ఖాయం. గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని పూర్తిగా విస్మరించింది. అందుకే ప్రజలు మోదీ గ్యారంటీల కోసం ఎదురుచూస్తున్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు

- మిగతా 2వ పేజీలో



# మోదీ గ్రేటర్ ప్లాన్!

(మొదటి పేజీ తరువాయి)

విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ప్రధాని స్వయంగా పలకరించడం ద్వారా ఆయనకు ఇచ్చే ప్రాధాన్యతను చాటిచెప్పారు. గ్రేటర్ ఎన్నికల ప్రచారంలో పవన్‌ను స్టార్ క్యాంపెయినర్‌గా వాడుకోవడం ద్వారా యువత ఓట్లను బీజేపీ ఖాతాలో వేయాలన్నది మోదీ వ్యూహంగా కనిపిస్తోంది. మోదీ కేవలం ఏపీ నేతలను పలకరించడానికే వచ్చారని అనుకుంటే పొరపాటే. బెంగాల్‌లో మాదిరిగా ప్రతి గల్లీ రాజకీయాలను కూడా బీజేపీ జాతీయ నాయకత్వం పర్యవేక్షిస్తుంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిగా బరిలోకి దిగితే, అది అధికార కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ అవుతుంది. గ్రేటర్‌లో గెలిస్తే ఆ ప్రభావాన్ని వచ్చే అసెంబ్లీ ఎన్నికల వరకు తీసుకెళ్లవచ్చని, తద్వారా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే మార్గం సుగమం అవుతుందని కమలనాథుల లెక్క. హైదరాబాద్ వంటి నగరంలో విజయం సాధించడం అంటే దక్షిణ భారతదేశంలో బీజేపీ పట్టును చాటిచెప్పడమే. అందుకే మోదీ ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేరు.

## రైల్వేలో కీలక ముందడుగు 'ఔషధి ఎక్స్‌ప్రెస్'

(మొదటి పేజీ తరువాయి)

తొలి ప్రత్యేక ఫార్మసీ రైలును ప్రారంభించడం హర్షణీయం. ప్రధాని మోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు ధన్యవాదాలు. ఈ కోల్డ్ స్టోరేజీ రైలుతో హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు చాలా మేలు జరగనుంది. దేశవ్యాప్తంగా, వివిధ దేశాలకు సరైన సమయంలో ఔషధాలను చేరవేసేందుకు వీలు కలుగుతుంది" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## మోదీ గ్యారంటీ కోసం రాష్ట్ర ప్రజలు

# ఎదురుచూస్తున్నారు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నాయి. ఒక వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లు, దొంగ ఓట్లను మాత్రమే తొలగిస్తున్నారు. మోదీ సభ విజయవంతం కావడం చూసి కాంగ్రెస్ నేతలు లేనిపోని విమర్శలు చేస్తున్నారు" అని రామచందర్‌రావు అన్నారు. బండి సంజయ్ తనయుడి కేసులో ఎలా స్పందిస్తారని విలేకరులు ప్రశ్నించగా.. 'బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, మా పార్టీ నేత. ఆయనకు ఈ కేసుతో సంబంధం లేదు. కేసులో ఆయన కుటుంబ సభ్యుల జోక్యం ఉంటే పోలీసులు చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారు" అని బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గౌతంరావు, కాసం వెంకటేశ్వర్లు, శిల్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

## విద్యకు బడ్జెట్‌లో

# 15% నిధులిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రసంగించారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే.. 'విద్యాఖశాఖకు ఈ ఏడాది రూ.26,674 కోట్లు కేటాయించాం. రాష్ట్ర బడ్జెట్‌లో 8.22 శాతం కేటాయింపులు జరిపాం. గతేడాది కంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కేటాయింపులు పెంచాం. ఇదేవిధంగా ఏటా పెంచుతాం. ఓఆర్ఆర్ లోపల క్యూర్ ప్రాంతంలో రూ.1,700 కోట్ల నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈ రోజు శంకుస్థాపన చేయడం శుభపరిణామం. వర్సిటీలు, విద్యను నిర్లక్ష్యం చేస్తే తెలంగాణ సమాజం బలహీనపడుతుంది. పేదలకు న్యాయమైన విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని అందించడం మా ప్రభుత్వ బాధ్యత. రాష్ట్రంలోని తండాలు, గూడేలు, మారుమూల గ్రామాల్లోని పేదలు, దళితులు, గిరిజనులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో విద్యాశాఖను నేనే నిర్వహిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నాం. ప్రజాప్రభుత్వంలో కేవలం 60 రోజుల వ్యవధిలో 11 వేల మంది టీచర్లను నియమించడం చరిత్రాత్మక అంశం. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా 22 వేల టీచర్లకు పదోన్నతులు, 36 వేల మంది టీచర్లకు బదిలీలు పూర్తి చేశాం. నీతిఆయోగ్ నివేదికలో విద్యలో రాష్ట్రం సాధించిన విజయాలను అభినందించింది. ఇందుకు విద్యాశాఖ ఉద్యోగులు, టీచర్లను అభినందిస్తున్నాను. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షలకు పైగా పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. 1.05 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నాడు.

### విదేశాల్లో విద్యాబోధన, అభ్యసన కార్యక్రమాల పరిశీలనకు టీచర్లను పంపుతాం

దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది. ప్రపంచ దేశాల్లో విద్యావిధానాన్ని కూడా మనం అధ్యయనం చేయాలి. మంత్రులు, ఉన్నతాధికారులే కాదు.. క్షేత్రస్థాయిలో బోధించే టీచర్లు ఈ అధ్యయనంలో భాగం కావాలి. అందుకే ఇటీవల 25 మంది ప్రభుత్వ టీచర్ల బృందాన్ని ఫిన్లాండ్‌కు పంపించాం. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చే ఉపాధ్యాయులను ఎంపిక చేసి 500 మందిని విదేశాలకు పంపించాలనుకుంటున్నాం. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఎడ్యుకేషన్ కిట్ కోసం రూ.1,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ప్రభుత్వ టీచర్లకు ఉద్యోగం కాదు భావోద్వేగం. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పని చేయాలి. విద్యాశాఖకు మంత్రి లేడని కొందరు బుర్ర లేకుండా మాట్లాడుతున్నారు. సమీక్ష సమయంలో నన్ను ముఖ్యమంత్రిగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. కావాలనే నేను విద్యా శాఖను నా దగ్గర పెట్టుకున్నాను'అని సీఎం స్పష్టం చేశారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులకు నగదు బహుమతులను సీఎం అందజేశారు. ఈ సమావేశంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ అజహరుద్దీన్, జి.వివేక్ పాల్గొన్నారు.

## బండి భగీరథ్ కేసులో దర్యాప్తు ముమ్మరం

**హైదరాబాద్ (ప్రజాతీర్పు),**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరమైంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పర్యవేక్షణాధికారిగా నియమితులైన కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ సోమవారం మధ్యాహ్నమే కేసు నమోదైన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంఘటన పూర్వాపరాలను సమీక్షించారు. ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన వివరాల గురించి ఆరా తీశారు. భగీరథ్.. తన కుమార్తెను వేధిస్తున్నాడంటూ 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఈ నెల 8న కేసు నమోదైన సంగతి తెలిసిందే. కేసు నమోదు సమయంలోనే బాధితురాలైన బాలిక నుంచి పోలీసులు వాంగ్మూలం నమోదు చేశారు. దీన్ని పరిశీలించిన డీసీపీ రితిరాజ్ మంగళవారం మరోమారు బాలికను భరోసా కేంద్రానికి పిలిపించాలని ఆదేశించారు. తన సమక్షంలోనే విచారించి మరోమారు వాంగ్మూలం నమోదు చేయనున్నారు. ఈ వాంగ్మూలాన్ని బట్టి అవసరమైతే ఇప్పటికే నమోదైన సెక్షన్లలో మార్పులు చేయడంగానీ, అదనపు సెక్షన్లు జోడించడంగానీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బాధితురాలు ఇవ్వబోయే వాంగ్మూలానికి ప్రాధాన్యం ఏర్పడింది. పోలీసుల సమాచారం ప్రకారం.. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదును కూడా డీసీపీ రితిరాజ్ పరిశీలించారు. మైనర్ అయిన తన కుమార్తెను బండి భగీరథ్.. లైంగికంగా వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం, బెదిరించడం వంటి నేరాలకు పాల్పడ్డాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజకీయంగా దుమారం రేపిన ఈ కేసు దర్యాప్తు పురోగతిని సమీక్షించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. సోమవారం ఉదయం డీజీపీ ఆనంద్‌ను పిలిపించి పూర్వాపరాలను సమీక్షించారు.

# భారత్ ఎవరికీ తలవంచదు

## దేశ ఆత్మ గౌరవానికి ప్రతీక సోమనాథ్.. విదేశీ ఆక్రమణదారులు కూల్చినా మళ్లీ నిర్మించుకున్నాం

### ఆలయ అమృతోత్సవాల్లో ప్రధాని నరేంద్ర మోదీ

### సోమనాథుడికి పుణ్యక్షేత్ర జలాలతో అభిషేకం

### గగనతలంలో భారత వాయుసేన విన్యాసాలు



గాంధీనగర్, మే 11: భారత్ ఎవరికీ తలవంచదని, అందుకే.. దేశాన్ని అణచివేయడం ప్రపంచంలో ఏ దేశానికీ సాధ్యం కాలేదని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లా ప్రభాస్ పటాన్ లో సోమనాథ్ ఆలయ పునరుద్ధరణ జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఆయన అమృతోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా మోదీ ప్రభా స్ పటాన్‌లో రోడ్‌షో నిర్వహించారు.(రోడ్డు కు ఇరువైపులా వేలాది మంది ప్రజలు జేజే లు పలుకుతూ ప్రధానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మోదీ ఆలయానికి చేరుకు ని సోమనాథుడికి 11 పుణ్యక్షేత్రాల జలాలతో కుంభాభిషేకం, మహాపూజ నిర్వహించారు. ఆలయ శిఖరంపై ధ్వజారోహణం చేశారు. వేడుకల సందర్భంగా భారత వాయు సేన విమానాలతో గగనతలంలో విన్యాసాలు చేసింది. 'సూర్య కిరణ్' అనే విమాన శ్రేణి ఆలయ శిఖరం పైనుంచి చక్కర్లు కొట్టింది. తర్వాత మోదీ ప్రసంగిస్తూ.. సోమనాథ్ ఆల యం దేశ ఆత్మ గౌరవానికి ప్రతీక అని అభివర్ణించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్, బా బూ రాజేంద్రప్రసాద్ వంటి నేతలు ఆలయ పునరుద్ధరణకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఆ సమయంలోనూ కొందరు రాజకీయ నేతలు ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకించారని గుర్తుచేశారు. అదేతరహా మన స్తత్వం అయోధ్య రామమందిర నిర్మా ణం సమయంలోనూ కనిపించిందని ఆవేదన వ్యక్తంచేశారు. విదేశీ దురాక్రమణదారులు సోమనాథ్ ఆలయాన్ని ఎన్నిసార్లు కూల్చినా, భారతీయులు దానిని మళ్లీ మళ్లీ నిర్మించుకుంటూ వచ్చారని, ఇదే భారత నిజమైన ఆత్మ అని పేర్కొన్నారు. ఆల య అమృతోత్సవాల నిర్వహణ అంటే, కేవలం గతాన్ని స్మరించుకోవడమే కాదని, రానున్న వెయ్యేళ్ల వరకు వేడుకలు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆకాంక్షించారు. 1998లో సరిగ్గా ఇదే రోజున (మే 11) పోఖ్రా న్ అణు పరీక్షలు విజయవంతమయ్యాయని గుర్తుచేశారు. అణ పరీక్షల నేపథ్యంలో ప్ర పంచ దేశాలన్నీ ఆర్థికపరమైన ఆంక్షలు విధించి భారత్‌ను ఇబ్బంది పెట్టాలని చూశాయన్నారు. అలాంటి క్లిష్ట సందర్భంలో నాటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా అణు పరీక్షలు నిర్వహించారని కొనియాడారు. భారత్ రాజకీయ సంకల్పం ఎంత దృఢంగా ఉంటుందనేది అణుపరీక్షలు చాటి చెప్పాయని అభిప్రాయపడ్డారు. ఆలయ 75 ఏళ్ల వేడుకలకు సంబంధించి మోదీ అనంతరం ఒక తపాలా బిళ్లను సైతం విడుదల చేశారు. వేడుకల్లో గుజరాత్ ముఖ్యమంత్రి భూపేం ద్ర పటేల్, హోం శాఖ మంత్రి హర్ష్ సంఘ వి, సోమనాథ్ ట్రస్ట్ కార్యదర్శి పీకే లహిరి తదితరులు పాల్గొన్నారు.

### అవే వ్యాఖ్యలు.. మళ్లీ దుమారం

సోమనాథ్ పర్యటన ముగించుకుని సోమవారం సాయంత్రం వడోదర చేరుకున్న ప్రధాని మోదీ దేశ ఆర్థిక వ్యవస్థ పరిరక్షణ, విదేశీ మారక ద్రవ్యం ఆదాపై ఆదివారం చేసిన వ్యాఖ్యలనే పునరావృతం చేశారు. పశ్చిమాసియా ఉద్రిక్తల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో అస్థిరత ఏర్పడిందని, ఇలాంటి క్లిష్ట సమయంలో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయడం ప్రతి భారతీయుడి బాధ్యత అని ఉద్ఘాటించారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని వీలైనంత తగ్గించాలని, మెట్రో రైళ్లు, ఎలక్ట్రిక్ బస్సులు వంటి ప్రభుత్వ రవాణా సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్ పూలింగ్ పద్ధతి పాటిస్తే మేలు అని, ఒకే వాహనంలో ఎక్కువ మంది ప్రయాణిస్తే మరింత ఇంధనం ఆదా అవుతుందని, రవాణా ఖర్చులు మిగులుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు మళ్లీ వర్క్ ఫ్రం హోం సంస్కృతిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. డిజిటల్ సాంకేతికత అందుబాటులో ఉన్నందున వర్చువల్ సమావేశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. భారత్ యేటా వేల కోట్ల రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని బంగారం దిగుమతి కోసం ఖర్చు చేస్తోందని, అందుకే వినియోగదారులు మరో ఏడాది వరకు బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు. విదేశీ పర్యటనలు, విదేశాల్లో వివాహాలు సైతం రద్దు చేసుకోవాలని సూచించారు. ప్రధాని వ్యాఖ్యలతో మళ్లీ దేశవ్యాప్తంగా దుమారం రేగింది. నగల దుకాణ కంపెనీలు మోదీ వ్యాఖ్యలపై పెదవి విరుస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమయ్యే సమయంలో ప్రధాని వ్యాఖ్యలు మార్కెట్‌ను పడగొట్టేలా ఉన్నాయని వాపోతున్నాయి. ఇప్పటికే తమ షేర్లు పడిపోయాయని, మళ్లీ అలాంటి వ్యాఖ్యలే చేస్తే మరింత నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రజా జీవనంపై అప్రకటిత నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

సలహాలు తీసు కోకుండా ఏకపక్ష నిర్ణయాలు సరికాదు. దేశంలో సంక్షోభం తలెత్తే అంశాలపై రాహుల్‌గాంధీ ఆరు నెలల నుంచే చెబుతున్నా అంతా సవ్యంగా ఉందంటూ చెప్పుకొచ్చారు. కేంద్రానికి ఓ స్పష్టమైన విధానం లేదు. దశ, దిశ లేదు. అనుభవ రాహిత్యం, అహంకారంతో దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారు. గాలి తిని, గాల్లో బతకమని చెప్పి మోదీ వెళ్లిపోయారు. పశ్చిమాసియా యుద్ధంలో మనమేమీ ప్రత్యక్షంగా పాల్గొనడం లేదు..' అంటూ సీఎం విమర్శించారు. సోమవారం తన నివాసంలో ఆయన మీడియాతో సుదీర్ఘంగా చిట్‌చాట్ చేశారు.

### మావోయిస్టులను చంపడమే బీజేపీ ఎజెండా

'బీజేపీ విధానాలను వ్యతిరేకించే వారిని ఖతం చేయడమే ఆ పార్టీ విధానం. ముస్లింలు, మావోయిస్టులు, కమ్యూనిస్టులు ఈ దేశ పౌరులు కారా? వారికి తమ సిద్ధాంతాలను చెప్పుకునే స్వేచ్ఛ లేదా? మావోయిస్టులను చంపడమే బీజేపీ ప్రభుత్వం ఎజెండాగా పెట్టుకుంది. మేము ప్రాణాలు తీయడానికి వ్యతిరేకం. మా సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను కూడా ఒప్పించి జనజీవన స్రవంతిలోకి తీసుకుని రావడానికి ప్రయత్నిస్తాం. మనుషుల ప్రాణాలకు మా ప్రభుత్వం విలువ ఇస్తుంది. దేశం కోసం ప్రాణాలు ఇచ్చిన పార్టీ మాది. మనుషులను చంపడం పరిష్కారం కాదు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు అత్యధికంగా తెలంగాణలోనే లొంగిపోయారు. 818 మంది మావోయిస్టులు రాష్ట్రంలో సరెండర్ అయ్యారు. వందలాది ఆధునాతన ఆయుధాలను అప్పగించారు. అందుకోసం మేం ప్రత్యేక చొరవ తీసుకున్నాం.

### మేం బుల్లెట్ కాదు బ్యాలెట్ అన్నాం..

లొంగిపోయిన వారికి రక్షణ, వైద్యం, ఆర్థికపరమైన సాయం ప్రభుత్వం అందిస్తుంది. మావోయిస్టుల విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. భూ పంపిణీ, ఉపాధి హామీ పథకాల అమలుతో వారి ఉద్యమాలు తగ్గాయి. గణపతి కూడా జనజీవన స్రవంతిలో కలవాలి. ప్రధానమంత్రి రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసులను అభినందించకపోగా విమర్శించడం దురదృష్టకరం. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని మేం అన్నాం. చివరకు మావోయిస్టులు మా లైన్‌కు వచ్చారు. ముస్లింలను వేరే చేసి చూపించడం మంచిది కాదు. కలిసి ఉండాలని ప్రధాని మాట్లాడాలి కానీ విడగొట్టాలని మాట్లాడం దురదృష్టకరం. బీజేపీ బ్రిటిష్ జనతా పార్టీ.. విభజించు, పాలించు అన్నదే వాళ్ల సిద్ధాంతం..' అని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు.

### నేను అడిగిన అంశాలకు మోదీ అంగీకరించారు..

'ఆదివారం అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా నేను



అడిగిన అంశాలకు ప్రధాని అంగీకరించారు. అందులో ఎలాంటి రాజకీయాలు లేవు. మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌కు సాయం చేసిన విధంగానే తెలంగాణకు కూడా మీరు సహకరించాలని కోరా. అందుకు ప్రధాని స్పందిస్తూ.. 'నీవొక్కడివే చేస్తే అనుకున్న లక్ష్యాలను (3 ట్రిలియన్ ఎకానమీ) సాధించలేవు. నీ కలలు నిజం అవ్వాలంటే మాతో కలిసి వస్తే.. అది సాధ్యం అవుతుంది' అనే విధంగా అన్నారు. అయితే ఆయన మాటలను ఎవరికి తోచిన విధంగా వారు అర్థం చేసుకుంటున్నారు. నేను బీజేపీని ఓడించే ముఖ్యమంత్రి అయ్యా. నన్ను కాదు..రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకెళ్తానని మోదీ అన్నారు.

### ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదు..

రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ సమన్వయంపై మేం చర్చించాం.. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సిందే..అది హక్కు. వాటిని సాధించుకుంటాం. కేంద్రంతో సత్సంబంధాలు లేకుండా నిధులు అడగకుండా ఉంటే రాష్ట్రం ఏ విధంగా ముందుకెళ్తుంది? కానీ కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో సహకారం లభించడం లేదు. కొన్ని అంశాల్లో సహకరిస్తున్నా.. మంత్రులను కలిసి ఎన్నిసార్లు అడిగినా అనుమతులు రావడం లేదు. రాష్ట్రాల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రధాని కార్యాలయంలో సింగిల్‌విండో ఏర్పాటు చేయాలి..' అని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

### కేంద్రం విధానంపైనే అభ్యంతరాలు

'చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజన, జమిలి ఎన్నికలకు ఎలాంటి అడ్డంకి లేదు. నియోజకవర్గాల పెంపునకు సంబంధించి కేంద్రం అనుసరించే విధానంపైనే ప్రతిపక్ష పార్టీలన్నింటికీ అభ్యంతరాలు ఉన్నాయి. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు, నియోజకవర్గాల పెంపునకు ముడిపెట్టడంతోనే బిల్లు వీగిపోయింది. 50 శాతం సీట్ల పెంపునకు ఎలాంటి ఫార్ములా లేదు. 2029లో జమిలి ఎన్నికలు, మహిళా రిజర్వేషన్లు అమలు కావొచ్చు. అయితే బీజేపీ ఎన్నికల విధానం అంతా జెమినీ సర్కస్‌లా ఉంటుంది. తెలంగాణలో అధికారంలోకి వస్తామని ప్రధాని అన్నారు. వారిష్టం.. ఆనందపడనివ్వండి. రెండు సీట్లతో ప్రస్థానం ప్రారంభించిన బీజేపీ భవిష్యత్తులో మళ్లీ ఆదే రెండు సీట్లకు పరిమితం అవుతుంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కూడా మాకు ఒక రాష్ట్రం వస్తే.. వారికి ఒక రాష్ట్రం అదనంగా వచ్చింది అంతే. కేరళలో 3 సీట్లు ,తమిళనాడులో 2 సీట్లు మాత్రమే బీజేపీ గెలుచుకుంది..' అని సీఎం వ్యాఖ్యానించారు.

### పాఠశాలల్లో యాంటీ డ్రగ్ ప్రమాణం

'రాష్ట్రంలో పాఠశాలల ప్రారంభోత్సవం రోజున పిల్లలతో యాంటీ డ్రగ్ ప్రమాణం చేయించనున్నాం. అందుకోసం రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాను ఆహ్వానిస్తున్నాం. నిపుణులు, విద్యావంతులతో పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాతే పాఠశాల విద్యాశాఖలో ఇంటర్ విలీనంపై ఒక నిర్ణయం తీసుకుంటాం. తుమ్మిడిహెట్టిపైన ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాశాం. ఇంకా స్పందన రాలేదు. రెండు రాష్ట్రాల మధ్య సమస్య వచ్చినప్పుడు ప్రధానమంత్రి పెద్దరికం వహిస్తే బావుంటుంది.

### ధాన్యం సేకరణలో సమస్యలు

ధాన్యం సేకరణలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. ధాన్యం దిగుబడి విపరీతంగా వచ్చింది. ప్రకృతి కారణంగా కూడా సమస్యలు ఉన్నాయి. అన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం.

### గత ఎక్సెస్ టెండర్లపై సీబీఐ విచారణకు సిద్ధమా?

హామ్ రోడ్ల టెండర్లలో అన్నీ ఎక్సెస్ అని హరీశ్‌రావు వ్యాఖ్యానిస్తున్నారు. 26 శాతం లెస్‌కు వచ్చిన విధంగానే అందరికీ ఇవ్వాలని అంటే.. గతంలో వారు ఎక్సెస్‌కు ఇచ్చిన టెండర్లన్నింటిపై సీబీఐ విచారణకు సిద్ధమా? నాకు ఎవరిపైనా కక్ష లేదు. తప్పు చేసిన వారిని న్యాయస్థానాలు శిక్షిస్తాయి..' అని సీఎం వ్యాఖ్యానించారు. మీ విషయంలో అలా జరగలేదు కదా అని ఓ విలేకరి ప్రశ్నించగా.. అడవికి రాజునని, వేటాడి చంపే మృగం బలం ఉన్నప్పుడు అలా వ్యవహరించినా.. శక్తి లేనప్పుడు పొదల మాటున, రాళ్ల మాటున దాగి మరణిస్తుందని అంటూ ఇది ఎవరినీ ఉద్దేశించి తాను వ్యాఖ్యానించడం లేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## కాల్పుల విరమణ గాల్లో దీపం

(మొదటి పేజీ తరువాయి)

ఏ క్షణంలోనైనా మొదలుకావొచ్చని ట్రంప్ పరోక్ష సంకేతాలిచ్చారు. ఇరాన్ పంపిన ప్రతిపాదనలను వెనువెంటనే తిరస్కరించానని ట్రంప్ వెల్లడించారు. 'స్పష్టమైన నిర్ణయాలు తీసుకోలేని ఇరాన్ నాయకత్వం మధ్యవర్తుల ద్వారా కొన్ని చెత్త ప్రతిపాదనలను తాజాగా నా ముందుకు తెచ్చింది. అందుకే వాటిని పూర్తిగా చదవకుండానే నిర్దాక్షిణ్యంగా తిరస్కరించా. అవి నాకు అస్సలు నచ్చలేదు. ఆ ప్రతిపాదనలు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేవు"అని అన్నారు. ఇరాన్ నాయకత్వ ఆలోచనా ధోరణిపై ట్రంప్ మాట్లాడారు. "ప్రతిపాదనలు ఇచ్చిపుచ్చుకోవడం, మా మిత్రదేశాలపై క్షిపణులు, డ్రోన్ల దాడులతో నేను ఇబ్బంది పడతానని, ఏం చేయాలో తోచక పిచ్చెక్కుతుందని ఇరాన్ భావిస్తోంది. నాపై ఒత్తిడి ఉంటుందని అనుకుంటున్నారు. వాస్తవానికి మాపై ఎలాంటి ఒత్తిడి లేదు. మేం విజయం సాధించబోతున్నాం. నా దగ్గర అద్భుతమైన ప్రణాళిక ఉంది. సైనికపరంగా ఇరాన్‌ను ఎప్పుడో ఓడించాం. వాళ్ల దగ్గర పరిమితస్థాయిలోనే సైనిక సంపత్తిఉంది. అదికూడా ఈ కాల్పుల విరమణ కాలంలో సమకూర్చుకున్నదే. ఈపాటి ఇరాన్ బలాన్ని మేం ఒక్కరోజులో సర్వనాశనం చేయగలం. అందుకు నా దగ్గర చక్కటి ప్లాన్ ఉంది. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని సాధించబోదు. వాస్తవానికి ఇరానియన్లు చాలా ప్రమాదకరం. ఎప్పుడు ఎలాంటి విపరీత ఆలోచనలు చేస్తారో ఎవరికీ తెలీదు"అని అన్నారు

## మోదీ పాలనా సామర్థ్యం కోల్పోయారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణించండి, ఇంటి నుంచే పనిచేయండి అంటూ మోదీ హితోక్తులు పలికారు. ఇవి ప్రజల శ్రేయస్సును కోరి చేసిన సూచనలు కాదు. ఆయన వైఫల్యానికి నిదర్శనాలు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. మరోవైపు ప్రధాని ప్రకటనను భాజపా సమర్థించింది. పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశ ప్రజలకు ప్రధాని చేసిన పొదుపు సూచనల్ని రాహుల్‌విమర్శించడాన్ని తప్పుపట్టింది.

కాంగ్రెస్ అధికారానికే పరిమితమైంది తప్ప జాతి నిర్మాణానికి కాదని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు. పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో త్యాగాలు చేయాల్సిందిగా ప్రధాని ప్రజల్ని కోరలేదని భాజపా ఐటీ విభాగం అధినేత అమిత్ మాలవీయ అన్నారు. జాతీయ ప్రయోజనం కోసం ఇంధనాన్ని ఆదా చేయడం, దేశీయ ఉత్పత్తుల్ని ప్రోత్సహించడం, విదేశీ మారకాన్ని ఆదా చేయడం, స్వావలంబనను బలోపేతం చేయడం వంటి కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సిందిగా మాత్రమే ఆయన ప్రజల్ని కోరారని మాలవీయ పేర్కొన్నారు.



## వేములవాడలో ఓటర్ మ్యాపింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

### స్థానిక అర్బన్ తహసీల్దార్ ను కోరిన ముస్లిం టౌన్ కమిటీ వినతి.

**(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) మే 11**

వేములవాడ పట్టణంలో ఓటర్ మ్యాపింగ్ సెంటర్ ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ వేములవాడ ముస్లిం టౌన్ కమిటీ అధ్యక్షులు అక్రమ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ జయంత్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాన్స్యూమర్స్ కౌన్సిల్ అధ్యక్షులు పాష సయ్యద్ మాట్లాడుతూ, వేములవాడ పట్టణ పరిధిలో అనేక మంది ఓటర్లకు సంబంధించి ఓటర్ జాబితాలో తప్పులు, అడ్రస్ మార్పులు, కొత్త ఓటర్ నమోదు సమస్యలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేకించి ముస్లిం మైనారిటీల పలువురి పేర్లు జాబితా నుండి గల్లంతవడం, పోలింగ్ బూత్ ల మార్పిడిపై స్పష్టత లేకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఓటర్ మ్యాపింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తే ఓటర్లే వెళ్లి వివరాలను సరిచేయడం, కొత్త ఓటర్ల నమోదు, డూప్లికేట్ ఓట్ల తొలగింపు ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు. అధ్యక్షులు అక్రమ్ మాట్లాడుతూ దీనివల్ల పారదర్శకమైన ఓటర్ జాబితా రూపొందుతుందని, ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల దృష్ట్యా ఈ సమస్యపై తక్షణమే స్పందించి పట్టణంలో ఓటర్ మ్యాపింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసి ఓటర్లకు న్యాయం చేయాలని తహసీల్దార్ ను కమిటీ సభ్యులు కోరారు. జన గణన కు సంభందించి ప్రజలలో అవగాహణ కల్పించాల్సిన బాధ్యత అధికారుల పై ఉంది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి..

- హమాలీల కోరత లేకుండా చర్యలు తీసుకోవాలి..
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మంత్రి అడ్లూరి..

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే11**

**జగిత్యాల జిల్లా బుగ్గారం**

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా బుగ్గారం, గోపులాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. హమాలీల కొరత లేకుండా కాంటాలు పూర్తయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని, హమాలీల సమస్య ఉంటే అదనంగా డబ్బులు చెల్లించి కొనుగోలు పూర్తి అయ్యేవిధంగా అధికారులు ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు నిత్యం ధాన్యం కొనుగోలు కేంద్రాలు సందర్శించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి కొనుగోలు వేగవంతం అయ్యే విధంగా చూడాలని మంత్రి సూచించారు. బుగ్గారం మండల కేంద్రంలో అదనపు ధాన్యం కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు మంత్రిగారి దృష్టికి తీసుకువెళ్లగా ఎందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గోపులాపూర్ గ్రామంలో రైతులు యూరియా స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని కోరగా సంబంధిత అధికారులతో మాట్లాడిన మంత్రి ఖరీఫ్ సీజన్ కల్లా గోపులాపూర్ రైతులకు యూరియా పాయింట్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## నిర్మల్ పోలీస్...మీ పోలీస్

- నిర్మల్ టౌన్ పరిధిలోని లాడ్జీలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు
- లాడ్జీలు, హోటళ్ల నిర్వాహకులు పోలీస్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 11(ప్రజాతీర్పు ):**

జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్మల్ టౌన్ పరిధిలోని లాడ్జీలు, హోటళ్లలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలు, హోటళ్లలో బసకు వచ్చే ప్రతి వ్యక్తి పూర్తి వివరాలు నమోదు చేయాలని, ఆధార్ వంటి గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని పోలీసులు సూచించారు. సీసీ కెమెరాలు ఎల్లప్పుడూ పనిచేసేలా చూసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. లాడ్జీలు, హోటళ్లలో మద్యం సేవించడం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అనుమతి ఇవ్వరాదని హెచ్చరించారు. మైనర్ బాలికలు లేదా అనుమానాస్పద పరిస్థితుల్లో వచ్చిన వ్యక్తుల వివరాలను తప్పనిసరిగా ధృవీకరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన లాడ్జీ, హోటల్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ తో పాటు, పట్టణ ఇన్స్పెక్టర్ సమ్మయ్య, సిబ్బంది ఉన్నారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు...

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 11.**



జగిత్యాల జిల్లా కేంద్రంలో, పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్ పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు, ఉన్నత వర్గాలకు మాత్రమే అందుబాటులో ఉండే సమ్మర్ క్యాంప్ లు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించడం వల్ల బడుగు బలహీన వర్గాల పిల్లలకు ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని అన్నారు. విద్యార్థులు అందరూ సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సమ్మర్ క్యాంపులో ఏర్పాటు చేసిన అబాకస్, బాక్సింగ్, కాలిగ్రఫీ, ఆటలు, డాన్స్ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా విద్యాధికారి రాము గారు మాట్లాడుతూ, ఎండాకాలం విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా సమ్మర్ క్యాంపు ఉపయోగపడుతుందని అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో పర్యావరణంపై విద్యార్థులకు కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు విద్యాశాఖ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలవిద్యాశాఖాధికారి చంద్రకళ, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల మార్కెట్ కమిటీ ఛైర్మన్ నారాయణ రెడ్డి, వార్డు కౌన్సిలర్ ప్రశాంత్ రావు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్పర్సన్ సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అమర్ నాథ్ రెడ్డి, ౹ా=ుఖ జిల్లా అధ్యక్షులు ఆనందరావు, తపస్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## కొండగట్టు గిరి ప్రదక్షిణకు సౌకర్యాలు కల్పిస్తాం..

### కొండగట్టు అంజన్న ఆలయంలో మంత్రి అడ్లూరి ప్రత్యేక పూజలు..

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 11.**

కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఒప్పించి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న స్వామి ఆలయంలో రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంత్రి అడ్లూరి అంజన్నను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ పూజారులు మంత్రి గారికి పుర్ణకుంభ స్వాగతం పలికారు. హనుమాన్ జయంతి సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ కొండగట్టు అంజన్న గిరి ప్రదక్షిణ కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి నిధుల విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరి ప్రదక్షిణ భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా వచ్చే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాదాయ శాఖ, పోలీసు శాఖ తరుపున అన్ని ఏర్పాట్లు చేశామని మంత్రి తెలిపారు. భక్తులు సమన్వయం చేసుకొని ప్రశాంతంగా స్వామి వారి దర్శనం చేసుకోవాలి మంత్రి అడ్లూరి సూచించారు. కొండగట్టు అంజన్న ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై, తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉండాలని ఆకాంక్షించినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. జిల్లా అధికారులు స్థానికంగా ఉండి భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.



## ఇండ్ల గణన ప్రక్రియను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 11(ప్రజాతీర్పు ):**

జనగణన ప్రక్రియలో భాగమైన హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం, నిర్మల్ గ్రామీణ మండలం తల్వేద గ్రామంలో జనగణనకు సంబంధించి చేపట్టిన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హౌస్ లిస్టింగ్ ప్రక్రియకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జనగణన ప్రక్రియలో ఇండ్ల గణన అనేది అత్యంత కీలకమని అన్నారు. నిర్ణీత గడువులోగా హౌస్ లిస్టింగ్ ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని వివరించారు. నిబంధనల ప్రకారం జనగణనకు సంబంధించి ఇంటి నంబర్లను కేటాయించాలని చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి, జిపిఓ లు జనగణన అధికారుల వెంబడి ఉండాలని పేర్కొన్నారు. జనగణన అధికారులకు అందించిన ఎన్యుమరేషన్ కిట్ లను పరిశీలించారు. జనగణ అధికారులు తప్పనిసరిగా తమ వెంట ఓఆర్ఎస్ పొట్లాలు ఉంచుకోవాలని సూచించారు. ఎండలు అధికంగా ఉన్నాయని, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను చేపట్టాలన్నారు.

స్థానికులతో మాట్లాడుతూ, జనగణన ప్రక్రియలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలన్నారు. అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పి వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఓ జీవరత్నం, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపిఓ శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ లక్ష్మి, జనగణన అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళ సాధికారత అవగాహన సదస్సు...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 11.**

మహిళా సాధికారత కేంద్రం ఆద్వర్యం లో సోమవారం 99 రోజుల ప్రణాళిక ప్లాన్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, లో భాగంగా భీమారం మండలం కాచారం గ్రామం లో జ్యోతి గ్రామైక్య మహిళ సంఘం మీటింగ్లి సందర్భంగా, , అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత గురించి, భేటీ బచావో బేటి పడావో పథకం గురించి, ఆడపిల్ల చదువు యొక్క ప్రాముఖ్యత గురించి, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్ ల గురించి, మొబైల్ మరియు సోషల్ మీడియా దుష్ప్రభావం గురించి, బాల్యవివాహాల నిషేధ చట్టం మరియు మహిళ రక్షణ చట్టాల గురించి వివరించడం జరిగింది, హెల్ప్ లైన్ నెంబర్స్ గురించి ,ఫైనాన్సియల్ స్కీమ్స్ కూడా వివరించడం జరిగింది,100,112,181,14567,1098 సఖి సేవలు, అంగన్వాడి సేవలు, చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్స్ ,సీనియర్ సిటిజన్స్ గురించి మరియు డ్రగ్స్ అడిక్ట్ గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు సి సి, వి ఓ ఏ, డి హెచ్ ఈ డబ్ల్యూ స్టాఫ్ పాల్గొన్నారు.

## ధాన్యం తరలింపులో జాప్యం వద్దు

### -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 11(ప్రజాతీర్పు ):**



కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ, రవాణాపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువకాలం నిల్వ ఉంచరాదని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ధాన్యం రాక మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అదనపు లారీలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అవసరానికి తగ్గట్టుగా రవాణా వాహనాలను అందుబాటులో ఉంచుకోవాలని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు సరిపడా హమాలీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజూ ఎంత ధాన్యం తరలించారనే వివరాలను ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశించారు. ఇప్పటివరకు జరిగిన ధాన్యం తరలింపు ప్రక్రియ, కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉన్న నిల్వల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జనగణన ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం అవ్వాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 11(ప్రజాతీర్పు ):**



జనగణన ప్రక్రియలో ప్రజలంతా భాగస్వామ్యం అవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పిలుపునిచ్చారు.

సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జనగణన ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రచార వాహనం ద్వారా జిల్లాలో ప్రజలకు జనగణన ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జనగణన ప్రక్రియకు సంబంధించి సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ ఆదివారంతో ముగిసిందని, జిల్లాలో సుమారు 20 వేల మంది ప్రజలు స్వయంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ పూర్తి చేసుకున్నారని వివరించారు. నేటి నుంచి జూన్ 9వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. జిల్లాలో జనగణన నిర్వహణ కోసం సుమారు 1,400 మంది ఎన్యుమరేటర్లు, 200 మందికి పైగా సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో ఎన్యుమరేటర్లు 33 ప్రశ్నలు అడుగుతారని, ప్రజలంతా అధికారులకు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. అందజేసే వివరాలన్నీ పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఈసారి జనగణన ప్రక్రియ మొత్తం కాగిత రహితంగా, పూర్తిస్థాయి డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుందని తెలిపారు. హౌస్ లిస్టింగ్ ప్రక్రియ పూర్తైన అనంతరం రెండో దశ జనగణన చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే జిల్లాలోని ప్రతి మండలం, పట్టణంలోని వార్డుల్లో ప్రత్యేక ప్రచార రథం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 2 లక్షల ఇళ్లలో సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో ఇంటి వివరాల నమోదు ప్రక్రియకు కేవలం 3 నుండి 4 నిమిషాల సమయం మాత్రమే పడుతుందని, ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీఓ జీవరత్నం, డీపీఆర్వో విష్ణువర్ధన్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్క జొన్న తీసుకెళ్ళకపోవడంతో రోడ్ ఎక్కిన రైతులు

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 11**

మక్కలు కొనుగోలు చేసిన రోజులు గడుస్తున్న సంచులను గోదాములకు తరలించకపోవడంతో సహనం నశించిన రైతులు బాసర– భైంసా రహదారిపై సోమవారం ఆందోళనకు దిగారు. ముధోల్ మండలంలోని కారేగాం గ్రామంలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో గత నెలలో మక్కా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక రైతులు తాము పండించిన మొక్కజొన్నను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. అయితే విక్రయించిన మొక్కజొన్నను సంచులను అధికారులు గోదాములకు తరలించాలి. అయితే,తరలించకపోవడంతో గత నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షంతో సంచులు తడిసిపోయాయ్యని రైతులు పేర్కొంటున్నారు. వందలా సంచులు కొనుగోలు కేంద్రాల్లో మగ్గుతున్నాయని రైతులు వాపోయారు. తక్షణమే సంచులను వెంటనే గోదాములకు తరలించాలని వారు డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు ఆందోళన విరమించేది లేదని రైతులు స్పష్టం చేశారు. గంటకు పైగా రాస్తారోకో నిర్వహించడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ తన సిబ్బందితో ఆందోళన వద్దకు చేరుకున్నారు. రైతులను,సముదాయించారుసంబంధిత అధికారులు వచ్చేంత వరకు ఆందోళన విరమించమని రైతులు స్పష్టం చేశారు. తాసిల్దార్ కు, పిఏసిఎస్ సిఇఓ కు ఫోన్ లో



సమాచారం చేరవేశారు. వెంటనే పిఏసిఎస్ సిఇఓ భూమయ్య ఆందోళన వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతులను సముదాంచి ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని మార్కెడ్ డిఎంకు ఫోన్లో తెలిపారు. డిఎం రైతులతో ఫోన్లో మాట్లాడిన రైతులు మాత్రం ఇక్కడ వచ్చేంత వరకు ఆందోళన విరమించేది లేదని పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై వాహనాలను దారి మళ్లించారు. రైతులు మాత్రం ఎండలోనే ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ ఆందోళనలో సర్పంచ్ మోత్రే నారయణ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధికారి కైరి సాయి మోహన్, రైతులు పాల్గొన్నారు. ఈ క్రమంలో రాస్తారోకో వద్దకు తహశీల్దార్ శ్రీలత చేరుకుని వెంటనే లారీని పంపిస్తాడు హామీ ఇచ్చారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- విద్యా వారోత్సవాల్లో అధికారులు భాగస్వాములు కావాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 11(ప్రజాతీర్పు ):**

ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందే వినతులను ఏమాత్రం జాప్యం చేయకుండా నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని, వారి వినతులపై అధికారులు సానుకూల దృక్పథంతో స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణిలో భాగంగా ప్రజలు ప్రధానంగా విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను సమర్పించారు. అధికారులు, సిబ్బంది విధిగా కార్యాలయ సమయాలను పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జిల్లావ్యాప్తంగా విద్యా వారోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు చురుకుగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ నెల 15న నిర్వహించనున్న 'లైబ్రరీ డే' సందర్భంగా అధికారులు పెద్ద ఎత్తున పుస్తకాలను వితరణ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# లక్కారం జిల్లా పరిషత్ హై స్కూల్లో 40 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

**ఖానాపూర్,మే 11(ప్రజా తీర్పు ప్రతినిధి):**

అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లక్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా బీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను స్వాతంత్ర్య దినోత్సవానికి ముందుగా పూర్తి చేసి ప్రారంభోత్సవం నిర్వహించాలని గుత్తేదారులకి,పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యే కి ఘనంగా శాల తో సన్మానించి పాఠశాలకు దినపు గదులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఇండ్ల గణన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**(వి,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) మే 11**

జనగణన 2027లో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి ఆకస్మికంగా సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇండ్ల గణన ప్రక్రియను అధికారులు నిబంధనలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ లలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, గృహ జాబితా కార్యక్రమం భవిష్యత్తు ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి టి సి పి ఓ సంపత్, జన గణన అధికారులు హరిప్రసాద్, కృష్ణ, ఎన్యుమరేటర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి సన్మానం

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 11**

నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని,కస్తూర్బా గాంధీబాలికలవిద్యాలయంలో,10వ తరగతిలో 600లో 565 మార్కులు సాధించి,ప్రతిభ కనబరిచిన జాదవ్ శివరాణి కి గ్రామ సర్పంచ్ బండారి పోసానిబాయి,ఘనంగా సన్మానించారు. అభినందించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు జాదవ్ భోజ బాయి,జాదవ్ జ్యోతి,గ్రామ పెద్దలు కదం సంభాజీ,కదం దత్తు, జగ్జీవన్,అశోక్ బండారి తదితరులు,పాల్గొని విద్యార్థిని శివరాణిని శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామ ప్రజలంతా ఆశీర్వదించారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా పదవుల దరఖాస్తుల స్వీకరణ

**ఖానాపూర్ మే 11(ప్రజా తీర్పు ప్రతినిధి)**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్‌లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా పదవుల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇంచార్జి సమత సుదర్శన్‌తో కలిసి నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికే పదవులు లభిస్తాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో జిల్లాలో అనుబంధ విభాగాల పదవుల భర్తీ జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు ఉంటాయని, యువతకు ప్రాధాన్యత ఇస్తూ పారదర్శకంగా నాయకులను ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొనారు.






# భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 11**

భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న 7 రోజుల విద్యా వారోత్సవాల పోస్టర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ కె. బుచ్చయ్య గారు పోస్టర్‌ను ఆవిష్కరించి వారోత్సవాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన,మాట్లాడుతూ,వారోత్సవాల్లో ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించేందుకు,వ్యక్తిత్వ వికాసం,నాయకత్వ లక్షణాలు,సామాజిక బాధ్యత, సృజనాత్మకత అభివృద్ధికి అనుగుణంగా వివిధ అకాడమిక్, సాంస్కృతిక,అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రతి రోజు నిర్వహించే కార్యక్రమాల వివరాలను అధ్యాపకులకు, విద్యార్థులకు తెలియజేస్తూ వారందరూ చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. రఘునాథ్, ఐక్యాక్ కోఆర్డినేటర్ డా.యు. రవి కుమార్, అడ్మిషన్ కోఆర్డినేటర్ డా.భీమారావు, పాల్గొన్నారు. అలాగే సీనియర్ అధ్యాపకులు డా.ఎం.శంకర్ గారు, ఆరే రాజు గారు,డా. ఓంప్రకాశ్ గారు,డా.సంతోష్ కుమార్,డా.మహేందర్,డా. కల్పన గారు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నూతన మల్టి స్పెషల్టీ ఆసుపత్రినీప్రారంభించిన

### ముధోల్ శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 11**

భైంసా పట్టణంలో డాక్టర్ ప్రీతమ్ మల్టీస్పెషాలిటీ,హాస్పిటల్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆసుపత్రిని ప్రారంభించి, వినూత్న వైద్య పరికరాలతో ఏర్పాటు చేసిన ఆధునిక సదుపాయాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ఆధునిక సాంకేతికతతో ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వాహకులను అభినందించి,ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని,సూచించారు. ఈకార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్,కౌన్సిలర్లు ప్రజాప్రతినిధులు, నాయకులు వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# పాస్ పుస్తకాల జారీలో జాప్యం.. రైతుల ఆందోళన

- పెండింగ్‌లో ఉన్న పాస్ పుస్తకాలను వెంటనే పంపిణీ చేయాలి
- డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్

**పెద్దపల్లి ప్రతినిధి, మే 11,(ప్రజా తీర్పు) :**



తెలంగాణ రాష్ట్రంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల జారీ ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసు కోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని సమత సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ ఆందోళన వ్యక్తం చేశారు. పాస్ పుస్తకాల ముద్రణ గత ఏడాది ఆగస్టు నుంచి నిలిచిపోవడంతో వేలాది మంది రైతులు బ్యాంకు రుణాలు పొందలేక, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి నుంచి దూరమవుతున్నారని ఆయన పేర్కొన్నారు. భూభారతి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు, ఇతర లావాదేవీలు ఆన్‌లైన్‌లో జరుగుతున్నప్పటికీ, ఫిజికల్ పాస్ పుస్తకాల జారీ నిలిచిపోవడం రైతులకు తీవ్ర సమస్యగా మారిందన్నారు. చెన్నైకి చెందిన ప్రింటింగ్ ఏజెన్సీ ఒప్పందం పునరుద్ధరణ కాకపోవడం, నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల పాస్ పుస్తకాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయి నెలలు గడుస్తున్నా పుస్తకాలు అందక రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ఫిజికల్ పాస్ పుస్తకం లేకపోవడంతో బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయడంలో నిరాకరిస్తున్నాయని నగేష్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ రికార్డులు ఉన్నప్పటికీ తనఖా కోసం పాస్ పుస్తకాన్ని తప్పనిసరిగా కోరుతున్నారని, దీంతో కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాల అమలులో కూడా జాప్యం ఏర్పడుతోందన్నారు. బ్యాంకు రుణాలు అందక రైతులు ప్రైవేట్ అప్పులవైపు మొగ్గుచూపాల్సి వస్తోందని, అధిక వడ్డీల భారం రైతాంగాన్ని మరింత కుంగదీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న పాస్ పుస్తకాల ముద్రణ పూర్తి చేసి రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, లేకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరించారు.

## విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ని సద్వినియోగం చేసుకోవాలి

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 11**



విద్యార్థులు సమ్మర్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి సుభాష్,దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి అన్నారు. సోమవారం భైంసా మండలం లోని దేగాం గ్రామం లోని పిఎం శ్రీ జడ్. పి. హైస్కూల్ లో విద్యార్థులకు, ఎండల్లో తిరగకుండా వేసవి కాల శిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. శిబిరంలో భాగంగాప్రతిరోజు పాఠశాలలో,క్రీడా పోటీలు, యోగ,క్విజ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు నీడ పట్టునే ఉండి ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో,పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్,ఉప సర్పంచ్ శివాజీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



# ఆహార భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ నాణ్యత ప్రమాణాలు పాటించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి.వెంకటేష్ ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 11**

జిల్లాలో ఆహార భద్రత శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆహార భద్రత విషయంలో ప్రతి ఒక్కరు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, మంచిర్యాల ఎ సి పి ప్రకాష్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా విద్యాధికారి యాదయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అనిత, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్ వాసు రామ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మహేష్ లతో కలిసి ఆహార భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, ఆహార సంబంధిత వ్యాపార, వాణిజ్య సంస్థల నుండి ఆహార భద్రత శాఖ అధికారులు ఆహార నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాలు పరీక్షించాలని తెలిపారు. ప్రతి నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించాలని, వివిధ యాజమాన్యాల క్రింద కొనసాగుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతను పరీక్షించాలని, ఆహార సంబంధిత వ్యాపార, వాణిజ్య సంస్థలలో కలిగి ఉన్న ఆహారం కాల పరిమితి, నాణ్యత పరీక్షించాలని, సంబంధిత సంస్థలు కలిగి ఉన్న ధ్రువపత్రాలు పరిశీలించాలని, సరైన పత్రాలు లేని సంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాల పరిమితి ముగిసిన ఆహార పదార్థాలు లభించినట్లయితే పూర్తి వివరాలతో నివేదిక అందించాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆహార పదార్థాల నాణ్యత సంబంధించిన ఫిర్యాదుల కొరకు 7981904028 నంబర్ లో సంప్రదించవచ్చని, ఆన్ లైన్ లో ష్ట్రజూం://టశింఎశిం.టంయిఖఱ.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ ద్వారా సంబంధిత వివరాలతో పాటు ఫోటో అప్ లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభం తర్వాత అంగన్వాడీలలో ఆహార నాణ్యతను పరిశీలించాలని తెలిపారు. జిల్లాలో గత త్రైమాసికంలో మొత్తంగా 4 కేసులు నమోదు కాబడి 95 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. ఆహార భద్రత విషయంలో తప్పులను పునరావృతం చేస్తే ఆహార సంబంధిత లైసెన్స్ క్యాన్సల్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# శివాంజనేయ స్వామి విగ్రహ పునరుద్ధరణ

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 11**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి హనుమాన్ జయంతి సందర్భంగా పంచముఖి శివాంజనేయ స్వామి విగ్రహ పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి బెల్లంపల్లి మండలంలోని కన్నాల ప్రాంతంలోగల శ్రీ పంచముఖి శివాంజనేయ స్వామి విగ్రహం యొక్క రంగులు వెలసి పోయినందున ఆగమ శాస్త్ర నిపుణుల సూచనల మేరకు,రంగులు వెలసిపోయిన విగ్రహాలు ఉండకూడదు కాబట్టి,బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి కొరకు,పట్టణ ప్రజల సుఖ,శాంతుల కొరకై శివాంజనేయ కమిటీ వారు మరియు దాతల సహకారంతో రంగులు వేయించి,హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ పంచముఖి శివాంజనేయ స్వామి విగ్రహ పునరుద్ధరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,భక్తి భావం సమాజంలో ఐక్యతను పెంపొందిస్తుందని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజలకు ఆత్మశాంతిని అందిస్తాయని,తెలిపారు. అనంతరం మహా అన్నప్రసాదం కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు,కన్నాల సర్పంచ్ నాతరి మల్లమ్మ , కమిటీ అధ్యక్షులు నర్సింగమ్, ఉపాధ్యక్షులు ఢీకొండ రాజలింగం, ఉపాధ్యక్షులు మరియు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బండి ప్రభాకర్ ప్రధాన కార్యదర్శి నాతరి స్వామి, సంయుక్త కార్యదర్శి నెల్లిరమేష్, కార్యదర్శులు నూనె ప్రభాకర్,కటకం సతీష్ సాంబశివ రావు, కౌన్సిలర్లు ఢీకొండ పద్మ , నిచ్చకోల వంశీ చింతల వసంత, నాయకులు కంకటి శ్రీనివాస్,గెల్లి రాజలింగు,నెల్లి సమ్మయ్య సుద్దాల శ్రీనివాస్,సమ్మిరెడ్డి, ఎనగందుల సుధాకర్ తిరుపతి,సుద్దాల రాజేష్ మరియు భూమిదాత శంకరయ్య, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# రైతులు ధర్నా చేస్తున్నా పాటించుకోరా

- పంటలు వేయమంటారు
- చేత్తికొచ్చాక మొహం చాటేస్తారు

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) మే 11**

మండలంలో పలు గ్రామాల్లో మొక్కజొన్న పొద్దుతిరుగుడు మరియు ఇతరత్ర పంటలు వేయమని వ్యవసాయ శాఖ సూచనల మేరకు వేరుశనగ పొద్దుతిరుగుడు పంటలు వేయగా పండించిన పంటలు కోతకు వచ్చినాక కోసి ధాన్యలను అమ్ముదామని వ్యవసాయ మార్కెట్ కు తీసుకవస్తే తీర కొనకుండా మొహం చాటేస్తున్నారని ప్రభుత్వం తీరు సరిగా లేదని పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించి మొక్కజొన్న పొద్దుతిరుగుడు వేరుశనగ పంటలను కొనుగోలు చేయాలని ధర్నా చేయగా రైతుల వద్దకు ఇల్లంతకుంట తహసీల్దార్ రాచకట్ల సురేష్ మరియు ఎస్ఐ సిరిసిల్ల అశోక్ అక్కడికి చేరుకొని వారి సమస్యలు తెలుసుకొని జిల్లా కలేక్టర్ దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు తొందరలోనే కొనుగోలు జరిగే విధంగా చూస్తామన్నారు ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు తదితరులు పాలుగోన్నారు

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలి





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి.వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 11**

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల, రామారావుపేట లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల తహసిల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని, జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చే వరి ధాన్యం తప్పనిసరిగా నిబంధనల ప్రకారం శుభ్రపరచి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలును పారదర్శకంగా చేపట్టి సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. గతం కంటే కొనుగోలు ప్రక్రియ వేగంగా జరుగుతుందని, లారీలు, హమాలీ సమస్యపై ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఈసారి అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం దెబ్బతినకుండా కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే జిల్లాలో గుర్తించిన గోదాములకు తరలించి నిల్వ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో 12 రైస్ మిల్లుల ద్వారా ధాన్యం ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. రామారావుపేట గ్రామంలోని చెరువు మత్తడి పరిశీలించిన అనంతరం గ్రామంలో కొనసాగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇండ్ల జాబితా బ్లాక్ ల ప్రకారం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం మార్గదర్శకాలను పాటిస్తూ వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. జనగణన గృహ జాబితా ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్త వహించాలని, ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని, సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జనగణన ఆధారంగా రూపొందించడం జరుగుతుందని తెలిపారు. నస్పూర్ మండలం తీగల్ పహాడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుండి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని సందర్శించారు. వేసవి శిక్షణ శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైనదని, వేసవి సెలవులలో విద్యార్థులు సమయం వృధా చేసుకోకుండా వేసవి శిబిరంలో అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ మద్దతి గృహాలను విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ, భోజనశాల వంటి సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేస్తుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేస్తూ సకాలంలో విద్యార్థులకు ఆహార అందించి వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. వేసవి శిక్షణ శిబిరాలలో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడ రంగంలో రాణించాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం, సంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.



# అగ్గిమల్లలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

## సర్పంచ్ కంకణాల వసంత లక్ష్మణ్

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే 11**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం అగ్గిమల్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్మించిన ఈ ఇళ్లను లబ్ధిదారులు సంప్రదాయబద్ధంగా ప్రారంభించారు. ?గ్రామ సర్పంచ్ కంకణాల వసంత లక్ష్మణ్, ఉప సర్పంచ్ తడవేని నరేష్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. వారితో పాటు వార్డు సభ్యులు కంకణాల వెంకన్న, కొక్కు సురేష్, సంధవేణి మల్లేష్, మారం అంజయ్య, మరియు గ్రామ కార్యదర్శి తిరుపతి తదితరులు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు. ?ఇందిరమ్మ కమిటీ పర్యవేక్షణ ?గృహాల నిర్మాణం మరియు లబ్ధిదారుల ఎంపికలో కీలకంగా వ్యవహరించిన ఇందిరమ్మ కమిటీ సభ్యులు సట్ట ఎల్లయ్య, తుల్ల అజయ్ ఈ సందర్భంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ?ముఖ్యమంత్రికి, మంత్రికి ధన్యవాదాలు ?నూతన గృహంలోకి ప్రవేశించిన లబ్ధిదారులు దడిగొప్పుల లిఖిత – శ్రీకాంత్ దంపతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ?ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.




# భద్రాచలంలో జనగణన ప్రక్రియకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి..!

## తాసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు

**(భూక్య సందీప్, ప్రజాతీర్పు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)మే 11**

భద్రాచలం డిజిటల్ న్యూస్ క్లబ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు జనగణన ప్రక్రియ ప్రారంభించేందుకు భద్రాచలం పట్టణాన్ని 78 బ్లాకులుగా విభజించి ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లను నియమించినట్లు భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి కుటుంబాల జాబితా సేకరణతో పాటు లేఅవుట్ మ్యాపింగ్ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం భద్రాచలం పట్టణంలోని పలు కాలనీలలో పర్యటించిన తహసీల్దార్, ఎన్యూమరేటర్లు మరియు సూపర్వైజర్లకు జనగణన ప్రారంభానికి ముందు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందించారు. ప్రతి బ్లాక్లో 150 నుండి 200 కుటుంబాలను గుర్తించి ఈ నెల 13వ తేదీ వరకు హౌస్ లిస్టింగ్ మరియు మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 14వ తేదీ నుండి ఇండ్ల గణన ప్రక్రియ ప్రారంభించి జూన్ 9 నాటికి పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన వెల్లడించారు. తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు మరియు రెవెన్యూ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి






## రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 11**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ రాష్టంలో త్వరలో చేపట్టే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమములో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు ప్రతి ఇంటింటిని సందర్శించి వివరాలు సేకరించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల వివరాలను ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాలని, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించాలని, మ్యాపింగ్ ప్రక్రియపై వారి అనుమానాలను నివృత్తం చేయాలని తెలిపారు. పెండింగ్లో ఉన్న ఫారం-6, 7, 8 లను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని, ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో మ్యాపింగ్ చేసుకునేలా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ద్వారా నియమించబడిన బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో స్పష్టమైన జాబితా రూపకల్పన చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# సింగరేణి కార్మికులకు ఊరట

- మెడికల్ బోర్డు పునరుద్ధరణకు యాజమాన్యం గ్రీన్ సిగ్నల్
- హైదరాబాద్‌లో మంత్రులు, ఉన్నతాధికారులతో ఐఎన్‌టీయూసీ నేతల చర్చలు

**గోదావరిఖని, మే 11 (ప్రజా తీర్పు)**



సింగరేణి కార్మికుల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి ఐఎన్‌టీయూసీ నేతలు చేపట్టిన చర్చలు ఫలప్రదంగా మారాయి. ముఖ్యంగా కార్మికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమైన మెడికల్ బోర్డు వ్యవహారంపై యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. బి. జనక్ ప్రసాద్ తెలిపారు. గతంలో మాదిరిగానే మెడికల్ బోర్డు నిర్వహణ కొనసాగించడంతో పాటు ఇప్పటికే నిర్వహించిన రెండు మెడికల్ బోర్డులపై రివ్యూ చేపట్టేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు వెల్లడించారు. సింగరేణి కార్మికుల సమస్యలపై డా. జనక్ ప్రసాద్ నాయకత్వంలో ఐఎన్‌టీయూసీ ముఖ్య నేతల బృందం ఇటీవల హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వెం నరేందర్ రెడ్డి తదితరులను కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాశ్ జ్యోతి ఐఏఎస్, డైరెక్టర్ (పీఏడబ్ల్యూ) గౌతమ్ పోట్రు ఐఏఎస్‌లతో సమావేశమై పలు కీలక అంశాలపై చర్చలు జరిపింది. చర్చల్లో కార్మికుల పర్క్స్‌పై విధిస్తున్న ఇన్‌కమ్ ట్యాక్స్ రద్దు, సొంతింటి పథకం అమలు, ట్రైనింగ్ పూర్తి చేసిన అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ, మారుపేర్ల మార్పు, డిస్మిస్ అయిన కార్మికుల సమస్యల పరిష్కారం, కొత్త బొగ్గు గనుల ప్రారంభం, విజిలెన్స్ కేసుల పరిష్కారం, పెండింగ్ బకాయిల చెల్లింపు వంటి అంశాలను ప్రస్తావించారు. కార్మికుల పర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ మాఫీ అంశాన్ని కూడా యాజమాన్యం సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు డా. జనక్ ప్రసాద్ తెలిపారు. సొంతింటి పథకం అమలుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ప్రభుత్వంతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నరసింహ రెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, త్యాగరాజన్, జెట్టి శంకర్ రావు, జనరల్ సెక్రటరీ వికాస్ కుమార్ యాదవ్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేందర్, వైస్ ప్రెసిడెంట్లు దాస్, కోట రవీంద్ర రెడ్డి పాల్గొన్నారు.



## రైస్ మిల్లు ప్రభుత్వ గోదాములను పరిశీలించిన

### ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) మే 11**

మండలంలోని చింతలకుంటపల్లె రైస్ మిల్లు, రహీంఖాన్‌పేటలోని ప్రభుత్వ గోదాములను ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, ఏపీఎం కుమారస్వామి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు.రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేసి గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా లారీ కాంట్రాక్టర్ గంప రామకృష్ణతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత లేకుండాచూడాలని సూచించారు. ధాన్యం రవాణాలో ఆలస్యం జరగకుండా అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.గోదాముల్లో నిల్వల నిర్వహణ, తేమ శాతం, నాణ్యత ప్రమాణాలపై కూడా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు ఐరెడ్డి సురేందర్ రెడ్డి, సుధగోని తిరుపతి, ఏఎంసీ సెక్రటరీ హరినాథ్, సంబంధిత అధికారులు, మిల్లర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా జంతువులను తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

### ఎస్పీ రోహిత్ రాజు.

**(భూక్య సందీప్, ప్రజాతీర్పు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) మే 11**



రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా జంతువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో అక్రమ జంతు రవాణాను అరికట్టడానికి పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్ట్లను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తనిఖీలను చేపట్టడం జరుగుతుందని వివరించారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పశువుల సంతలు,బక్రీద్ పండుగ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరు తదితర విషయాలపై అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేయడం జరిగిందని అన్నారు.జిల్లాలో ఎక్కడైనా చట్ట విరుద్ధంగా ఆవులు,దూడలను అక్రమంగా రవాణా చేసి,వధించడం పూర్తిగా నిషేధమని,అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇతర రాష్ట్రాలు,జిల్లాల నుండి జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు 02 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు,03అంతర్ జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి,మొత్తం 05 చెక్‌పోస్టుల వద్ద 24/7 నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీస్ సిబ్బందితో పాటు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు కఠినంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. జంతువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు,నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు.చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు.అలాగే అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని,వ్యక్తిగత దాడులు,గుంపులుగా దాడులు చేయడం కూడా శిక్షార్హమైన నేరాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి పశువుల అక్రమ రవాణా,అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ముఖ్యంగా యువత ఆవేశానికి లోనవకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని,మత పెద్దలు యువతకు శాంతి,సామరస్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్,ఫేస్‌బుక్ వంటి వాటిలో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ ఫోటోలు,అసత్య ప్రచారాలు,ప్రేరేపిత పోస్టులు పెట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇందుకోసం జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా ఉంచిందని తెలిపారు.ప్రజల్లో భయాందోళనలు కలిగించే రూమర్లు వ్యాప్తి చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని,డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.ప్రతీ పండుగ సందర్భంగా ప్రజలు పరస్పరం మతాలను గౌరవించుకుంటూ,శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



## అక్రమ పట్టాలతో ప్రజాధనం దుర్వినియోగం

### అసలు సాగుదారులకు న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 11:**



అక్రమ పట్టాల పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని ఆరోపిస్తూ ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన రైతులు సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అక్రమంగా పొందిన పట్టాలను వెంటనే రద్దు చేసి అసలు సాగుదారులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. రైతుల వివరాల ప్రకారం పోతారం గ్రామ శివారులోని సర్వే నంబర్ 59, మైదంబండ గ్రామ శివారులోని సర్వే నంబర్ 113 భూములకు సంబంధించి కొందరు వ్యక్తులు అసైన్మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే ప్రభుత్వాన్ని మోసం చేసి అక్రమంగా పట్టాలు పొందినట్లు ఆరోపించారు. ఆ పట్టాల ఆధారంగా బ్యాంకుల నుంచి మార్టిగేజ్, క్రాప్ లోన్లు, రైతుబంధు, రైతు భరోసా వంటి పథకాల కింద భారీ మొత్తంలో నిధులు పొందారని తెలిపారు. గత 50 సంవత్సరాలుగా తాము ఆ భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నప్పటికీ ఇప్పటివరకు పట్టాలు ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు రెవెన్యూ అధికారులు, మాజీ వీఆర్ఏ సహకారంతో ఈ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. అక్రమ పట్టాల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే గ్రామానికి వచ్చి పూర్తి స్థాయి విచారణ చేపట్టి పేద రైతులకు న్యాయం చేయాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వేణు స్పందిస్తూ అక్రమ పట్టాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వానికి నష్టం కలిగించిన వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం రోజుల్లో విచారణ పూర్తి చేసి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉష, దళిత సంఘం డివిజన్ నాయకులు ఊట్ల శ్రీనివాస్‌తో పాటు పోతారం గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట

**(భూక్య సందీప్, ప్రజాతీర్పు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)మే 11**



భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించిన అధికారులు, వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదేశించారు.రెవెన్యూ సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు మరియు ఇతర ప్రజా సమస్యలపై వచ్చిన అర్జీలను సంబంధిత శాఖాధిపతులు వ్యక్తిగతంగా పర్యవేక్షించి నిర్ణీత గడువులో పరిష్కారం చూపాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని, పెండింగ్ లేకుండా ఫిర్యాదులను పరిష్కరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్, డీఏవో రాజేంద్రనాథ్, వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం

**బీర్పూర్, మే11 (ప్రజా తీర్పు)**

బీర్పూర్ మండలంలో మంగేల గ్రామంలో చిట్యాల శ్రీలత- భూమయ్య తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వారికి ఇల్లు మంజూరు కాగా వారి గృహప్రవేశ ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. లబ్ధిదారులకు చీర కానుకగా అందజేసి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో.గ్రామ సర్పంచ్ సతీష్ ఎంపీడీవో భీమేష్ కేడిసిసీ రామచంద్ర రావు చైర్మన్ నవీన్ రావు . పలు గ్రామ సర్పంచులు . నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### అధికారులతో టెలికాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ మే 11 (ప్రజా తీర్పు)**



నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలకు భారీగా ధాన్యం వస్తుండడంతో రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగంగా జరగాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడేలా అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పన్నారు.కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగ్స్ కొరత రాకుండా చూసుకోవాలని, సాయంకాలం వర్షం వస్తే ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్ లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి వేసిన ఐదుగురు సభ్యుల కమిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించాలని, కొనుగోలు కేంద్రాల్లో ఏ సమస్య వచ్చిన కార్యాలయ దృష్టికి తీసుకు రావాలన్నారు.గ్రామ, మండల,జిల్లా స్థాయిలో కొనుగోలు విషయంలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మిల్లుల వద్ద సమస్య రావద్దని, ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు పై కంట్రోల్ రూమ్ ద్వారా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం పై మానిటరింగ్ చేయాలని, ధాన్యం తరలింపు లో వాహనాల సమస్య రావద్దని,ప్రతి జిల్లాకు ఒక ఏంవిఐ అధికారిని ప్రత్యేకంగా వాహనాలు తరలించడానికి కంట్రోల్ రూమ్ ద్వారా ఏర్పాటు చేయాలని డిటిసి లకు ఆదేశాలు ఇచ్చారు. హామాలీల కొరత లేకుండా చూసుకోవాలని, హుస్నాబాద్ మార్కెట్ యార్డు లో అడుగు పెట్టేంత స్థలం లేకుండా ధాన్యం వస్తున్నందున ఇప్పటికే ఐదు బృందాలు కాంట వేస్తున్నందున అదనంగా ఏర్పాటు చేయాలన్నారు.ఏ గ్రామం నుండి సమస్య వచ్చినా, ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఏఈవో, గ్రామ కమిటీ కో ఆర్డినేట్ చేసుకోవాలన్నారు. ప్రధానంగా ధాన్యం అధికంగా వచ్చే అక్కన్నపేట,హుస్నాబాద్ టౌన్ ,శనిగరం , కోహెడ , బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని, శనిగరం లో రోజుకు 3-4 లారీలు వస్తున్నాయి కాబట్టి అదనంగా లారీలు లేదా ట్రాక్టర్ లను ఉపయోగించాలన్నారు. ఇక నుండి రోజువారీగా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తానని మంత్రి చెప్పారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, డిఎస్ఓలు, డిఎం, సివిల్ సప్లై అధికారులు, ఎమ్మార్వోలు, వ్యవసాయ అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జీలు, గ్రామాల వారీగా ధాన్యం కొనుగోలు కమిటీల సభ్యులు ఉన్నారు.




## హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు

**హుస్నాబాద్ మే 11 (ప్రజా తీర్పు)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో విద్యా వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి ఘనంగా ప్రారంభించారు. మే 11 నుండి 17 వరకు జరగనున్న నేపథ్యంలో మొదటి రోజులో భాగంగా కళాశాలలో ఉన్న బోధనా వసతులు, సౌకర్యాలు మరియు విద్యా పరంగా సాధిస్తున్న ప్రగతిని తెలుపుతూ ప్రచార కర పత్రికలను ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉపయోగ పడే విధంగా అంతర్జాలం లో ఉన్న ఎలక్ట్రానిక్ రిసోర్సెస్ వివరాలతో కూడిన పుస్తకమును రూపొందించి విద్యార్థులకు అందించారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మరియు ఉద్యోగాల కల్పన కై స్థానిక జిన్నింగ్ కంపెనీ తో అవగాహనా ఒప్పందంను చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి మాట్లాడుతూ... విద్యా వ్యవస్థను పటిష్ట పరచడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా వారోత్సవాలలో విద్యార్థులను, స్థానిక యువత, ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయడం ద్వారా కళాశాల అభివృద్ధికోసం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఘన ఏర్పాట్లు

**ఖానాపూర్,మే 11(ప్రజా తీర్పు ప్రతినిధి):**



నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మెయిన్ రోడ్ చౌరస్తా,హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న పంచముఖి క్షేత్రంలో నేడు హనుమాన్ జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఇందులో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, భజనలు, హారతులతో కార్యక్రమాలు ప్రారంభమవు తాయని పేర్కొన్నారు.అలాగే భక్తులకు మహాప్రసాద వితరణ,అన్నప్రసాద కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పంచముఖ ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.



## శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వద్ద ప్రమాదకరంగా వేలాడుతున్న బోర్డు

- పొంచి ఉన్న ప్రమాదం.. • పట్టించుకోని అధికారులు...

**(నారుకట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) మే 11**

వేములవాడ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణకట్ట వెళ్లే ప్రధాన మార్గంలో ఏర్పాటు చేసిన స్వాగత బోర్డు ఒక భాగం ఊడిపడి ప్రమాదకరంగా వేలాడుతూ కనిపిస్తోంది. బోర్డు మధ్య భాగంలో ఇనుప ఫ్రేమ్ బయటపడటంతో భక్తులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రతిరోజూ వేలాది మంది భక్తులు రాకపోకలు సాగించే ఈ మార్గంలో బోర్డు భాగం ఎప్పుడైనా కింద పడే ప్రమాదం ఉందని స్థానిక భక్తులు పేర్కొన్నారు. ముఖ్యంగా పండుగలు, సెలవు రోజుల్లో భారీగా భక్తులు సంచరించే ప్రాంతం కావడంతో వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న బోర్డును తొలగించి, కొత్త బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి.



## పిఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బీర్పూర్ నందు ఉచిత వేసవిశిక్షణ.

**బీర్పూర్ , మే11 (ప్రజా తీర్పు)**

బీర్పూర్ మండలంలోని పి ఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ నందు.ఉచిత వేసవిశిక్షణ. సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని ప్రారంభించిన మండల విద్యాధికారి శ్రీ సిరుప నాగభూషణం మరియు బీర్పూర్ గ్రామ సర్పంచ్ హరీష్ .ఈ కార్యక్రమం లో బీర్పూర్ మండలంలోని 6 నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులకు తేదీ 11 -5 -2026నుండి25-5-2026వరకు15రోజులు,ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు పిఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ బీర్పూర్ నందు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని గౌరవ విద్యాశాఖ ఆదేశాల మేరకు నిర్వహించబడును ఈ శిబిరంలో కుట్టుపని, అల్లికలుమ్యూజిక్ క్లాసికల్ డాన్స్ డ్రాయింగ్ స్టోరీ టెల్లింగ్ ప్రొఫెషనల్ డెవలప్మెంట్ చెస్ ఇండోర్ గేమ్స్ మ్యాథమెటిక్స్ టిఎల్ఎం ప్రిపరేషన్ సింపుల్ సైన్స్ ఎక్స్పరిమెంట్స్ క్విజ్ కాంపిటీషన్ మాక్ పార్లమెంట్ మొదలైనఅంశాలపైమండలంలోని ఆరు నుండి తొమ్మిదవ తరగతి చదివే 100 మంది విద్యార్థులకు నిష్ణాతులైన శిక్షకులచే ఉచిత శిక్షణను ఇవ్వబడును.కావున ఇట్టి సదవకాశాన్ని.వినియోగించుకోగలరనిమండలవిద్యార్థులకు తెలియజేయడం జరిగింది, మరియు రైన్ వాటర్ హార్వెస్టింగ్ యూనిట్లను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీర్పూర్ గ్రామ సర్పంచ్ హరీష్ గారు మండల విద్యాధికారి శ్రీ సిరుప నాగభూషణం.పిఎంశ్రీ బీర్పూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి , కొల్వై హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యరాజ్ , సీనియర్ ఉపాధ్యాయులు లక్ష్మి నరసింహమూర్తివివిధ పాఠశాలల.ప్రధానోపాధ్యాయులు,ట్రైనింగ్ఉపాధ్యాయులు క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ సురేష్ శ్రీనివాస్ వెంకన్న పీడీ మంజుల ధరణి విద్యార్థులు పాల్గొన్నారు.



## తెలుగు వార్త దినపత్రిక 5వ వార్షికోత్సవంలో మంథని జర్నలిస్టు జంజర్ల రమేష్‌కు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు

**మంథని, మే 11(ప్రజాతీర్పు)**

తెలుగు వార్త దినపత్రిక 5వ వార్షికోత్సవ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలో ఉన్న హనుమంతురాయ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ ప్రతినిధులు, జర్నలిస్టులు, ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో తెలుగు వార్త దినపత్రిక అభివృద్ధికి కృషి చేస్తున్న జర్నలిస్టులను సంస్థ యాజమాన్యం సన్మానించింది. సంస్థలో సమర్థవంతంగా పనిచేస్తూ వార్తా రంగంలో విశేష సేవలు అందిస్తున్న పలువురు జర్నలిస్టులకు "బెస్ట్ ఎంప్లాయ్ అవార్డులు" ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలానికి తెలుగు వార్త దినపత్రిక ప్రతినిధిగా విధులు నిర్వహిస్తున్న ఏక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన జంజర్ల రమేష్‌కు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందజేశారు. ఈ అవార్డును తెలుగు వార్త దినపత్రిక యజమాని జలీల్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. అనంతరం జంజర్ల రమేష్‌ను సహచర జర్నలిస్టులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు. వార్తా రంగంలో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

# దళిత యువకుడి హత్య కేసు ఛేదించిన పోలీసులు

### ముగ్గురు నిందితుల అరెస్ట్ టాటా జెస్ట్ కారు మొబైల్ ఫోన్లు స్వాధీనం

**మంథని, మే 11 (ప్రజాతీర్పు)**



రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని-2 టౌన్ పోలీసులు దళిత యువకుడు జూల వంశీ హత్య కేసును వేగంగా ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. సోమవారం గోదావరిఖని ఏసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఏసిపి మడత రమేష్, గోదావరిఖని-2 టౌన్ సీఐ ప్రసాద్‌రావుతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జూల శంకరమ్మ తన కుమారుడు జూల వంశీ (ఎస్సి -- మాదిగ) 29-04-2026న ఇంటి నుండి వెళ్లి కనిపించకుండా పోయాడని 01-05-2026న గోదావరిఖని-2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినది. దీంతో పోలీసులు మ్యాన్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సిడిఆర్, మొబైల్ కాల్ వివరాలను పరిశీలించగా ఏ-1 అలేఖ్య, ఏ-2 నీలం నవీన్, ఏ-3 బుర్ర భాస్కర్‌లపై అనుమానం వ్యక్తమైనది. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ముగ్గురు కలిసి వంశీని హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం మృతుడు జూల వంశీ, అలేఖ్య 10వ తరగతి సమయంలో ప్రేమించుకున్నారు. అనంతరం అలేఖ్య నీలం నవీన్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. అయితే 2025 ఫిబ్రవరిలో జరిగిన 10వ తరగతి గెట్ టు గెదర్ కార్యక్రమం తర్వాత వంశీ అలేఖ్య మొబైల్ నంబర్ తీసుకుని ప్రేమ పేరుతో తరచూ ఫోన్ కాల్స్, మెసేజ్‌లు చేస్తూ వేధింపులకు గురి చేశాడు. అంతేకాకుండా వంశీ మూడు సార్లు అలేఖ్య ఫ్లాట్‌కు వెళ్లి గొడవలకు దిగాడు. ఈ సమయంలో నీలం నవీన్, బుర్ర భాస్కర్ అక్కడికి చేరుకుని అతడిని మందలించి పంపించారు. ఈ విషయాలను అలేఖ్య తన భర్త నవీన్‌కు, భాస్కర్‌కు తెలియజేయడంతో ముగ్గురు కలిసి వంశీని హత్య చేయాలని కుట్ర పన్నారు. పథకం ప్రకారం అలేఖ్య, భాస్కర్ ఫోన్ చేసి వంశీని హైదరాబాద్‌కు రప్పించారు. 30-04-2026న వంశీ ముందుగా అలేఖ్య ఫ్లాట్‌కు వెళ్లగా, అక్కడి నుండి ముగ్గురు కలిసి భాస్కర్‌కు చెందిన టాటా జెస్ట్ కారులో అతని ఫ్లాట్‌కు వెళ్లారు. అదే సమయంలో నవీన్‌పై అనుమానం రాకుండా ఉండేందుకు తాను డ్యూటీకి వెళు _న్నానని చెప్పినట్లు విచారణలో వెల్లడైంది.

తర్వాత భాస్కర్ తన ఫ్లాట్‌లో వంశీకి మద్యం తాగించి గొడవకు దిగాడు. అనంతరం ముందుగానే సిద్ధం చేసుకున్న కత్తితో వంశీ ఛాతి, మెడ భాగాల్లో విచక్షణారహితంగా పొడవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం అలేఖ్య ఫోన్ ద్వారా నీలం నవీన్‌కు సమాచారం ఇవ్వగా, నవీన్ అక్కడికి చేరుకుని భాస్కర్‌తో కలిసి గదిలోని రక్తపు ఆనవాళ్లను లైజాల్‌తో శుభ్రం చేసినట్లు వెల్లడైంది. అనంతరం భాస్కర్, నవీన్ కలిసి మృతదేహాన్ని ప్లాస్టిక్ కవర్లు, మ్యాట్‌లో చుట్టి కారులో ఉంచారు. తర్వాత భాస్కర్ ఒక్కడే టాటా జెస్ట్ కారు నంబర్ టిఎస్-07-యూహెచ్-6753లో మృతదేహాన్ని మంథని మండలం గాడుదులగండి ప్రాంతానికి తీసుకెళ్లి రోడ్డు పక్కనున్న లోయలో పడవేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుండి ఒక టాటా జెస్ట్ కారు, ఐదు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# బండి సంజయ్ కి రేవంత్ సర్కారు అండ

- భగీరథ్ ను కేసు నుంచి తప్పించేందుకు కుట్రలు
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్

**హుస్నాబాద్ మే 11 (ప్రజాతీర్పు)**



కేంద్ర మంత్రి బండి సంజయ్ కి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలుస్తూ ఆయన కొడుకు భగీరథ్ ఫోక్సో కేసును నీరుగార్చే కుట్రలు జరుగుతున్నాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనర్ బాలికలపై అఘాయిత్యాలకు పాల్పడిన భగీరథ్ పై బాధితుల ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసి మూడు రోజులు గడుస్తున్నా ఇంకా అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. హోం మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే పోలీసులు అరెస్టు చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన బాలికతో పాటు వారి కుటుంబ సభ్యులపై పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. పోక్సో కేసు కాకుండా సాధారణ కేసు నమోదు చేసి కేసు మొత్తాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. మంత్రుల కొడుకులకైతే ఒక న్యాయం... ఇతరులకు మరొక న్యాయం ఉంటుందా అని ప్రశ్నించారు. వెంటనే బండి సంజయ్ కొడుకు భగీరథ్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించాలని, కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ ని వెంటనే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిచో చట్టాలపై ప్రజలకు ఉన్న గౌరవం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని అన్నారు. భగీరథ్ కేసులో ఇంకా జాప్యం చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని సతీష్ కుమార్ హెచ్చరించారు.

## హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి

**రామడుగు, మే 11 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

ఈ నెల 12న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హిందూ ఏక్తా యాత్రను రాజకీయ పార్టీలకు అతీతంగా హిందువులందరూ విజయవంతం చేయాలని బీజేపీ మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ కట్ట రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వహిస్తున్న హిందూ ఏక్తా యాత్ర ద్వారా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ హిందువుల ఐక్యత కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను పరిరక్షించేందుకు ఈ యాత్ర దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ జిన్నారం విద్యాసాగర్, రామడుగు మండల మాజీ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జిట్టవేణి అంజిబాబు, మండల మాజీ అధ్యక్షుడు ఎడవల్లి లక్ష్మీకాంత రెడ్డి, సీనియర్ నాయకులు మునిగంటి శ్రీనివాసచారి, ప్రైవేట్ లెక్చరర్ల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు దాసరి నరేందర్, ఓబీసీ మోర్చా మాజీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి భాస్కరాచారి, పర్లపల్లి శంకర్, కోటగిరి ప్రశాంత్ చారి తదితరులు పాల్గొన్నారు.



## రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ విఫలం

### బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి

**హుస్నాబాద్ మే11 (ప్రజా తీర్పు )**

రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ధాన్యం కాంటాలు అయిపోయి రైస్ మిల్లులకు తరలిస్తే అక్కడ మిల్లర్స్ ఏ గ్రేడ్ బి గ్రేడ్లు చూడకుండా ధాన్యం అంతా కామన్ బ్రేడ్ కింద కొనుగోలు చేసి తరుగు తీసి రైతులను నిండా ముంచుతున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. సోమవారం మండలంలోని పందిళ్ళ రైస్ మిల్లులో ధాన్యం అన్లోడింగ్ సమస్యలపై తరుగుపై పరిశీలించి అనంతరం మాట్లాడారు. రైతులు అనేక పెట్టుబడులు పెట్టి ధాన్యాన్ని అమ్ముకుందామని కొనుగోలు కేంద్రాలకు వెళ్తే అడుగడుగునా కష్టాలు నష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొనుగోలు వేగవంతం లేకపోవడం వల్ల రోజులకొద్దీ కాలం గడపాల్సి వస్తుందని, మిల్లర్స్ ఏ గ్రేడ్ బి గ్రేడ్ అని చూడకుండా ధాన్యం అంతా కామన్ గ్రేడ్ కింద కొనుగోలు చేసి తలుపు తీస్తున్నారని, ప్రశ్నిస్తే ధాన్యం అంతటినీ కామన్ గ్రేడ్ కింద తీసుకుంటున్నట్లు చెబుతున్నారని అన్నారు. ఇలా కామన్ గ్రేడ్ కింద మిల్లర్స్ ధాన్యాన్ని తీసుకుంటే రైతులకు వచ్చే నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ గొప్పలు చెప్పుకొని ప్రచారం చేసుకోవడమే తప్ప రైతులను ఆదుకోవడంలో విఫలం చెందిందని ఆరోపించారు. అలాగే ధాన్యం ఆన్ లోడింగ్ లో అన్లోడింగ్ లో ఆలస్యం కావడంతో ట్రాక్టర్ డ్రైవర్ అనేక ఇబ్బందులు పడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టించుకోని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజాతీర్పు జర్నలిస్ట్ బొడ్ల భరత్ వివాహ వార్షికోత్సవ వేడుకల్లో టిడబ్ల్యూజేఎఫ్ ఘన సన్మానం

**( కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) మే 11 :**



వేములవాడ పట్టణానికి చెందిన ప్రజా తీర్పు జర్నలిస్ట్ బొడ్ల భరత్ కుమార్ వివాహ వార్షికోత్సవ వేడుకలు టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది ఇట్టి సన్మానం కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు బొప్ప బిక్షపతి, ఉపాధ్యక్షులు కవ్వాల సురేందర్ మరియు సిద్ధంశెట్టి వేణు, కొమురవెల్లి మునిష్, మధు, చింతల శ్రీనివాస్, కొప్పుల ప్రసాద్, చిర్రం ప్రసాద్, కోటగిరి రాజశేఖర్, దేవేందర్ రాజు పాల్గొన్నారు

# మోడల్ స్కూల్ లో కిచెన్ షెడ్ కు భూమి పూజ

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**రామడుగు, మే 11 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



రామడుగు మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని పరిశీలించిన చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామడుగు మోడల్ స్కూల్‌లో నిర్మించనున్న కిచెన్ షెడ్డు కోసం సోమవారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై నాలుగు లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణంలో విద్య అందించేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మోడల్ స్కూల్‌లో కిచెన్ షెడ్డు నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా మధ్యాహ్న భోజన కార్యక్రమం నిర్వహించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల విడుదలైన ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎమ్మెల్యే సన్మానించి అభినందించారు. ముఖ్యంగా రామడుగు మండలం మోతే గ్రామానికి చెందిన భోగ వీరేశం వసంత దంపతుల కుమార్తె భోగ శ్రీజ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 1000 మార్కులకు గాను 983 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆమెను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఇంత మంచి ప్రతిభ కనబరచడం అభినందనీయమని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని మరింత మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రంగనాథ్ శర్మ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆడెపు మనోజ్ కుమార్, తహసిల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎస్సై కోదాటి రాజు, సర్పంచ్ మొయిజ్, కార్యదర్శి దేవరకొండ శ్రీనివాస్, రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, జిల్లా ఉపాధ్యక్షుడు కోల రమేష్, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, సర్పంచులు గుమ్మడి మల్లేశం, ఎడవల్లి నరేందర్ రెడ్డి, శనిగరపు అంజన్న ప్రసాద్, ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మనీష్, మాజీ ఎంపీటీసీ తడగొండ హనుమంతు, శనిగరపు స్వామి, డైరెక్టర్ మేకల స్వామి, వడ్లూరి రాజేందర్, కర్ణ శీను, గాధం మాణిక్యం, చంటి వెంకటేష్, భువన్ గౌడ్, ఈశ్వర్, శేఖర్, అనిల్, కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ లపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 11



కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడులలోని నిబంధనలను నోటిఫై చేస్తూ ఎడిట్ చేయడానికి వ్యతిరేకిస్తూ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఖఖ 5 గని, కాసిపేట 1 గని, ఏరియా ఆసుపత్రులలో లేబర్ కోడ్ ప్రతులను డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అల్లి.రాజేందర్ బ్రాంచ్ అధ్యక్షులు వా.వెంకటస్వామిల ఆధ్వర్యంలో దహనం చేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో గెలిచిన వెంటనే లేబర్ కోడలు అమలుకై గెజిట్ ఇవ్వడం తాజాగా రెండు రాష్ట్రాల ఎన్నికల్లో గెలిచిన తర్వాత నిబంధనలను నోటిఫై చేస్తూ అమలుకు పూనుకుంటుందని దీనివలన కార్మిక వర్గం తీవ్ర నష్టం ఎదుర్కొబోతున్నదని అన్నారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరంలేని 51 శాతం గుర్తింపు నిబంధనను కార్మిక సంఘాల గుర్తింపు సంఘంకు విధించడం ఏమిటని కార్మిక సంఘాల ప్రభావాన్ని తగ్గించి కార్మికులకు వేతనాలను పెంచకుండా, పనిగంటలను పెంచుతూ శ్రమదోపిడి చేయడానికి ×= కోడ్ ఉద్దేశమని, అన్నారు. ఇప్పటికే బొగ్గు గని కార్మికులకు రావాల్సిన 12వ వేతన ఒప్పందానికి కమిటీ వేయాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడులను బూచిగా చూపెడుతూ ఆలస్యం చేస్తు శ్రామిక వర్గాన్ని నిరసనలు సమ్మెలు చేయకుండా జరిమానాలు కేసులు పెడతామని హెచ్చరించేలా నిబంధనలు రూపొందించడం వెనక కారణమేమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఇంతలా చేస్తుంటే ఇప్పటివరకు తెలంగాణ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఈ లేబర్ కోడ్ ల అమలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా పరోక్షంగా కేంద్ర ప్రభుత్వాన్ని సహకరించడం సరైన విధానం కాదని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గతంలోని కేరళ విజయన్ ప్రభుత్వం తీర్మానం చేసినట్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపి కార్మికుల పక్షాన నిలువాలని డిమాండ్ చేశారు. లేదంటే కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని అనుకోవాల్సి వస్తుందని భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వానికి నిరసన సెగలు తప్పవని అన్నారు. లేబర్ కోడులపై వెనక్కి తగ్గకపోతే నిరవధిక సమ్మెకు దిగడానికి అన్ని కార్మిక సంఘాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో దెబ్బటి.శ్రీనివాస్, నాగవెల్లి.శ్రీధర్, పసుపునుటి.శ్రీకాంత్, బద్రి.ఆదర్శ్, చీకటి.వంశీ, ఆర్గానైజర్ చైతన్య రెడ్డి దుర్గం రాంబాబు, మరియు కార్మికులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల సాకారం

## సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న

**రామడుగు/గంగాధర, మే 11 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

నిరుపేదల సొంతింటి కల సాకారం కావడమే నిజమైన అభివృద్ధి అని గంగాధర గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న అన్నారు. సోమవారం గంగాధర మండల కేంద్రానికి చెందిన గొల్లపెల్లి లత సత్తయ్య దంపతులు తెలంగాణ ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న, లబ్ధిదారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నిరుపేదలకు పక్కా గృహాలు కల్పించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎన్నో కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఒక సామాన్య కుటుంబం ప్రభుత్వ సహకారంతో తమ కష్టార్జిత సంపాదనతో సొంతింటిని నిర్మించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ గృహప్రవేశ కార్యక్రమానికి విచ్చేసి, కొత్త బట్టలు అందించి గౌరవించిన సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్నకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ యశ్వంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం వెంకటేశం, మంత్రి మహేందర్, జంగిలి మహేష్, గంగాధర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దీపక్ పునియాకు స్వర్ణ పతకం



డబ్ల్యూఎఫ్ఐ సీనియర్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్న మెంట్‌లో భారత స్టార్ రెజ్లర్ దీపక్ పునియా స్వర్ణంతో మెరిశాడు. సోమ వారం జరిగిన పురుషుల ఫ్రీ స్టయిల్ 92 కేజీల విభాగం ఫైనల్లో దీపక్ (హర్యానా).. తన రాష్ట్రానికే చెందిన వంశ్‌ను ఓడించి టాప్ ర్యాంకింగ్‌ను దక్కించుకున్నాడు. ఇతర విభాగాల్లో సాగర్ (57 కేజీలు), అభిషేక్ (61 కేజీలు), యష్ (74 కేజీలు), నవీన్ (79 కేజీలు) స్వర్ణాలు గెలుచుకున్నారు.

# భగీరథ్ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలి

## చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేష్

**హుస్నాబాద్ మే 11 (ప్రజా తీర్పు )**



తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ నాయకుల ఆగడాలు వారి కుటుంబ సభ్యుల అగడాలకు అడ్డు అదుపు లేకుండా విచ్చలవిడిగా రాష్ట్రంలో నేరాలు గోరాలు మోసాలకు పాలుపడుతున్నారని చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేష్ ఆరోపించారు. గత కొన్ని రోజులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి భగీరథ్ పై పోక్సో చట్టం కింద బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మైనర్ బాలికపై అనుచిత ప్రవర్తన, మద్యం తాగించి లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆమె తల్లి ఫిర్యాదు చెయ్యడంతో మే 8 రాత్రి కేసు నమోదైందని అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు.బీఎన్ఎస్ సెక్షన్లు 74, 75తో పాటు పోక్సో సెక్షన్లు 11/12 కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి కానీ అరెస్ట్ చెయ్యలేదు అంటే బండి భగీరథ్ కేసుపై నమోదు చేసిన సెక్షన్ లపై చాలా అనుమానాలు ఉన్నాయి కాబట్టి పోక్సో చట్టంలో లూప్ పాయింట్ వెతికి బెయిల్ వచ్చే విదంగా పోలీసులు కేసు నమోదు చేయడం ఒక రకంగా బండి సంజయ్ కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి భయపడి కేసును చిన్నది పెట్టడం పోలీసులు వ్యవస్థ కాంగ్రెస్ ప్రభుత్వం లో బీజేపీ కాంగ్రెస్ పార్టీలకు అనుకూలంగా పనిచేస్తున్నాయి అని దీనికి నిదర్శనం అన్నారు.బండి భగీరథ్ తన వైపు నుంచి కరీంనగర్ రెండవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎదురు ఫిర్యాదు చేయడం ఎంత విడ్డురం,హనీ ట్రాప్‌లో పడ్డానని బ్లాక్‌మెయిల్ చేసి రూ.5 కోట్లు డిమాండ్ చేశారనీ చెప్పడం రూ.50 వేలు ఇచ్చానని పిర్యాదు చేయడం, ఏ తప్పు చేయకుండా డబ్బులు ఎందుకు ఇచ్చారు ఇది పొలిటికల్ ఇమేజ్ ని అపహాస్యం చేయడమేనన్నారు. ఇష్టానుసారం చేయడం అమ్మాయిలను బలి చేయడం, మళ్ళీ సుద్దపూసలాగా రెవంజ్ కేసులు పెట్టడం అదికూడా వాళ్ళ అయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పట్టణంలో కేసులు వేయడం చాలా అనుమానాలు ఉన్నాయన్నారు. బండి సంజయ్ పుత్రుడు భగీరథ్ ని తక్షణమే అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించి అమ్మాయి కుటుంబానికి సెక్యూరిటీ కలిపించి న్యాయ సలహాల కోసం కోర్టులో ఒక్క మంచి లాయర్ ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చెసి దుర్మార్గునికి శిక్ష పడే విదంగా చెయ్యాలని డిమాండ్ చేశారు.

# పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసులో నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే11**



హైదరాబాద్ నగరంలోని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి కోర్టు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది.పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.317/2025గా,ూాజుూాూష్ సెక్షన్ 9(అ) తీ/ష 10 కింద నమోదైన ఈ కేసులో యంజాల శివ అలియాస్ శివ (40),వృత్తి మేస్త్రీ,జల్పల్లి గ్రామం,బాలాపూర్ మండలానికి చెందిన వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు.ఈ కేసును రంగా రెడ్డి జిల్లా ఎల్‌బీనగర్‌లోని అత్యాచారం మరియు పోక్సో కేసుల వేగవంతమైన విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు విచారించి నిందితుడిని దోషిగా తేల్చింది.కోర్టు నిందితుడికి ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించింది.అలాగే బాధితురాలికి రూ.1,00,000 పరిహారం అందజేయాలని ఆదేశించింది.ఈ కేసులో దర్యాప్తు అధికారిగా పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి.లక్ష్మయ్య వ్యవహరించగా,అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సత్యనారాయణ కోర్టులో వాదనలు వినిపించారు.కేసు విచారణలో సీడీఓలు, సమన్ల అధికారి, లైజన్ అధికారులతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎండపల్లి తహసిల్దార్ కార్యాలయ బిల్లులు చెల్లించాలి

- మూడున్నరేళ్ల నుండి బకాయిని భరిస్తున్న
- బిల్లులు చెల్లించని యెడల ఫర్నీచర్ వెనక్కి తీసుకెళ్తా
- ఎండపెల్లి మాజీ సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి), మే 11:**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫర్నీచర్ బిల్లుల వివాదం మరోసారి చర్చనీయాంశమైంది.

అప్పట్లో మండల అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయ సౌకర్యాల కోసం తన సొంత డబ్బుతో సామాగ్రి సమకూర్చిన మాజీ సర్పంచ్ మారం జలేందర్ రెడ్డికి ప్రభుత్వం ఇప్పటికీ బిల్లు చెల్లించకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.2022 అక్టోబర్ 21న ఎండపల్లి మండలం అధికారికంగా ప్రారంభమైన సమయంలో తహశీల్దార్ కార్యాలయానికి అవసరమైన టేబుళ్లు, కుర్చీలు, ఫర్నీచర్ తదితర సామాగ్రిని రూ.2,57,499 వ్యయంతో కొనుగోలు చేసి అందజేసినట్లు ఆయన తెలిపారు.అయితే అప్పటి నుంచి నేటివరకు సంబంధిత శాఖ నుంచి ప్రభుత్వం ద్వారా ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. గత మూడున్నరేళ్లుగా కార్యాలయం అదే సామాగ్రితో కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, తన బిల్లుల విషయంలో మాత్రం అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. పలుమార్లు తహశీల్దార్లను కలిసి విజ్ఞప్తి చేసినా, జగిత్యాల కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మా గ్రామంలో నూతనంగా మండలం ఏర్పడిందని, ప్రభుత్వ కార్యాలయం కోసం ప్రజాప్రతినిధిగా ప్రజలందరికీ ప్రభుత్వ సేవలందాలని కార్యాలయానికి తన సొంత ఖర్చులతో సామాగ్రిని సమకూర్చాను. కానీ ప్రభుత్వం ఇప్పటివరకు కార్యాలయ ఖర్చుల నిమిత్తం నిధులు విడుదల చేయకపోవడం అత్యంత బాధాకరమని వాపోయారు. వారం రోజుల్లోగా పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోతే తాను కార్యాలయం ముందు నిరసన చేపట్టడంతో పాటు తాను సమకూర్చిన ఫర్నీచర్, ఇతర సామాగ్రిని ట్రాక్టర్లలో తీసుకెళ్లి కార్యాలయం ఖాళీ చేస్తానని హెచ్చరించారు. ప్రజాప్రతినిధి స్వచ్ఛందంగా ముందుకొచ్చి కార్యాలయ అవసరాలు తీర్చినా, చెల్లింపుల్లో జాప్యం జరగడం అధికార వ్యవస్థలోని అలసత్వాన్ని బయటపెడుతోంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించకపోతే, ఇది పరిపాలనా వైఫల్యంగా మిగిలే అవకాశం ఉందని స్థానికులు, మండల ప్రజలు, రాజకీయ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయిలు విడుదల చేస్తారా? లేక మాజీ సర్పంచ్ ఆవేదన, హెచ్చరికలను ప్రభుత్వం పెడచెవిన పెడుతుందా వేచి చూడాల్సిందే.

# అజాగ్రత్తగా కారు నడపడంతో విద్యార్థిని భార్గవి మృతి

**(ఎర్రోజు విష్ణు చారి, ప్రజాతీర్పు సిద్దిపేట ప్రతినిధి) మే 11**



సిద్దిపేట జిల్లా వర్గల్ లోని మహాత్మా జ్యోతిబాపూ మహిళా డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం పొతున్న, చదువుతున్న జె భార్గవి తండ్రి విఠల్, వయస్సు:21 సం” సొంత గ్రామం ఇందూర్ గ్రామం, రైకోడ్ మండలం, సంగారెడ్డి జిల్లా వారు సుమారు, ఉదయం ,11:30 సమయంలో వర్గంలోని మహాత్మ,జ్యోతిభా మహిళ డిగ్రీ కళాశాల లోకి వెళ్లే క్రమం లో,మార్స్ ఇండియా కంపెనీ ముందు నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా అదే సమయం లో సిద్దిపేట వైపు నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న టాటా జెస్ట్ కారు టక్కర్ ఇచ్చినట్టు, గౌరారం ఎస్సై జె ఆరోగ్యం, తెలిపారు,,డ్రైవరు జంగా రాజు, తండ్రి చంద్రయ్య, నివాసం: కడవేర్గు గ్రామం, చెరియాల మండలం, సిద్దిపేట జిల్లా, నిర్లక్ష్యంగా మరియు అతివేగంగా వాహనం నడిపి ఆమెను డి కొట్టగా ఆమెకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ఆమె మృతి చెందినట్టు తెలిపారు,ఇట్టి పిర్యాదు పై మృతురాలి తండ్రి విఠల్ ఇచ్చిన పిర్యాదు, తీసుకొని, కారు డ్రైవరు పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు,




# జల్‌పల్లి సర్కిల్‌లో జనగణన కార్యక్రమం ప్రారంభం

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే 11**

ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ చంద్రకళ మేడమ్ గారు ఆకస్మిక తనిఖీ నిర్వహించి, సూపర్వైజర్లు మరియు ఎన్యుమరేటర్లకు జనాభా లెక్కల సేకరణలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా, ప్రతి ఇంటి మరియు ప్రతి వ్యక్తి వివరాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలందరూ ఎన్యుమరేటర్లకు తమ వివరాలను సహకారంతో అందించాలని కోరారు. జల్‌పల్లి సర్కిల్ పరిధిలో సుమారు 42,500 ఇండ్ల వివరాలను సేకరించేందుకు 223 మంది ఎన్యుమరేటర్లు, 36 మంది సూపర్వైజర్లను నియమించినట్లు డిప్యూటీ కమిషనర్ బి. వెంకట్‌రామ్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి. వినయ్‌కుమార్ గారు, సిబ్బంది లోకేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ ధమాకా.. దంచికొట్టిన అక్షర్, మిల్లర్

- 3 వికెట్ల తేడాతో పంజాబ్‌పై ఉత్కంఠ విజయం
- ప్లేఆఫ్స్ రేసులో నిలిచిన డీసీ
- కింగ్స్‌కు వరుసగా నాలుగో ఓటమి

తొలి ఏడు మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన తర్వాత అనూహ్యంగా తడబడుతున్న పంజాబ్ కింగ్స్ వరుసగా నాలుగో ఓటమి మూటగట్టుకుంది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే ప్రతీ మ్యాచ్ గెలవాల్సిన స్థితిలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయం అందుకుంది. భారీ లక్ష్య ఛేదనలో టాపార్డర్ తడబడినా కెప్టెన్ అక్షర్ పటేల్ (30 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 56), డేవిడ్ మిల్లర్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 51) ఖతర్నాక్ ఆటతో విజృంభించడంతో సోమవారం జరిగిన మ్యాచ్‌లో డీసీ 3 వికెట్ల తేడాతో పంజాబ్‌ను ఓడించి ఐదో విజయం ఖాతాలో వేసుకుంది. ప్రత్యర్థి ఇచ్చిన 211 పరుగుల లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి మరో 6 బంతులు మిగిలుండగానే ఛేదించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన పంజాబ్ 20 ఓవర్లలో 210/5 స్కోరు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 59 నాటౌట్), ప్రియాంశ్ ఆర్య (33 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 56) అర్ధ శతకాలతో రాణించారు. మాధవ్ తివారి, మిచెల్ స్టార్క్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.



## ప్రియాంశ్, శ్రేయస్ ధనాధన్

ఓపెనింగ్‌లో ప్రియాంశ్.. తర్వాత శ్రేయస్ దూకుడుగా ఆటడంతో పంజాబ్ భారీ స్కోరు చేసింది. పవర్ ప్లేలో ప్రియాంశ్ పవర్ ఫుల్ షాట్లతో సిక్సర్ల వర్షం కురిపించాడు. మిచెల్ స్టార్క్‌కు రెండు సిక్సర్లతో స్వాగతం పలికిన అతను ఎంగిడి బౌలింగ్‌లో ఆర్య 6,6,4 కొట్టడంతో మూడు ఓవర్లకే స్కోరు 50 దాటింది. అదే జోరుతో అతను 24 బంతుల్లోనే లీగ్‌లో ఐదో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా పవర్ ప్లేను కింగ్స్ 72/0తో ముగించింది. అంత ధాటిగా ఆడలేకపోయిన మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (18)ను ఏడో ఓవర్లో ముకేశ్ కుమార్ వెనక్కుపంపి ఢిల్లీకి తొలి బ్రేక్ ఇచ్చాడు. కానీ, ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. వన్‌డౌన్‌లో క్రీజులోకి వచ్చిన శ్రేయస్ ఆకిబ్ నబీ బౌలింగ్‌లో వరుస ఫోర్లతో తన ఉద్దేశం ఏంటో చెప్పాడు. కొత్త పేసర్ మాధవ్ తివరి బౌలింగ్‌లో ఆర్య.. సాహిల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటైనా.. కూపర్ కనోలి (38) తోడుగా శ్రేయస్ రన్‌రేట్ తగ్గకుండా చూసుకున్నాడు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020